STV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 54 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 5 డిసెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



# భారత్ చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

## ఘనంగా స్వాగతం పలికిన ప్రధాని మోడీ

**ఇరువురు నేతలు కలసి ప్రధాని నివాసానికి చేరిక**

**నేడు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు**

రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు చేరుకున్నారు. ఢిల్లీ సమీపంలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దిగిన ఆయనకు ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ఇద్దరు నేతలు ఒకే కారులో ప్రధాని అధికారిక నివాసానికి ప్రయాణమయ్యారు.

4



# హెల్త్ సెక్యూరిటీ 2025 బిల్లు

## లోక్‌సభలో ప్రవేశ పెట్టిన నిర్మలమ్మ

లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ హెల్త్ సెక్యూరిటీ సెస్, నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025ను ప్రవేశపెట్టారు. రెండు ప్రయోజనాల రీత్యా కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఒకటి ఆరోగ్య భద్రత, రెండు జాతీయ భద్రత ఈ రెండు అంశాలపై ఈ బిల్లును రూపొందించినట్లు సీతారామన్ తెలిపారు.

4

## ప్రపంచస్థాయి ప్రమాణాలతో

# క్రియేటివ్ సిటీ

**అమరావతిలో ప్రతి భవనం ఓ అద్భుతంలా ఉండాలి**

**క్రియేటివ్ సిటీగా తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు**

**గవర్నర్ నివాసం,జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణాలు**

**మౌలిక వసతుల కోసం 7,380 కోట్ల నాబార్డు రుణం**

**అమరావతి :** రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఒక 'క్రియేటివ్ సిటీ'గా తీర్చిదిద్దనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధానిలో నిర్మించే ప్రతి భవనం ప్రత్యేకంగా, విలక్షణంగా ఉండాలని, పచ్చదనంతో కళకళలాడాలని ఆయన ఆకాంక్షించారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

మిగతా 5 లో



## ఆరు కంపెనీలకు ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాలు

- రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదం
- పెట్టుబడులపై పోర్టల్ ద్వారా నిరంతర పర్యవేక్షణ
- సీఐఐ సదస్సుకు ముందు తరవాత 50శాతం ప్రక్రియ మొదలు
- చంద్రబాబు అధ్యక్షతన 13వ ఎస్ఐపీబీ సమావేశం
- వివరాలు వెల్లడించిన మంత్రులు భరత్, దుర్గేశ్

05



# ప్రజల కోసం మాత్రమే పనిచేస్తా

**నాకు పదవి అలంకరణ కాదు.. ఓ బాధ్యత**

**ప్రజలకు సేవలందించడానికి డీడీవో ఆఫీసులు**

**చిత్తూరు పర్యటనలో డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్**

05



## ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మిస్తా

# పరిశ్రమలు తెస్తా

- యూనివర్సిటీ ఏర్పాటుకు తక్షణ హామీ
- సిమెంట్ పరిశ్రమను తెరిపించి యువతకు ఉద్యోగాలు
- ఆదిలాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ వెల్లడి
- రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ఆదిలాబాద్, డిసెంబరు 4:** ఆదిలాబాద్ జిల్లాకు సీ ఎం రేవంత్‌రెడ్డి వరాల జల్లు ప్రకటించారు. ఎయి ర్‌పోర్టు, యూనివర్సిటీ, తుమ్మడిహట్టి ద్వారా నీ ళ్లు తీసుకొచ్చే బాధ్యత తనదని ప్రకటించారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టుపై రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఏడాదిలోపు ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభిస్తామని వ్యాఖ్యానిం చారు. వరంగల్‌తో పాటు ఆదిలాబాద్‌కు అన్ని ర కాల వసతులతో కూడిన ఎయిర్‌పోర్టు ఉండాల్సిం దేనని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక్కడ ఎయిర్‌పోర్టు వస్తే ఆదిలాబాద్‌కు పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఎర్రబస్సే కాదని.. ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు కూడా తీ సుకువస్తామని చెప్పుకొచ్చారు. ఆదిలాబాద్‌లో సీఎం పర్యటించారు.

మిగతా 2లో

## థాంక్యూ సీఎం గారు



**రేవంత్‌రెడ్డికి బీజేపీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు**

02



# రాహుల్ గాంధీకి సుప్రీంలో ఊరట

**భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసు**

**ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేసిన సుప్రీం**

.. వివరాలు 4లో

# హిడ్మాది బూటకపు ఎన్‌కౌంటర్



- హిడ్మాతో పాటు శంకర్‌లకు చిత్రహింసలు
- చికిత్స కోసం విజయవాడకు వెళితే పట్టుకుని కాల్చివేత
- దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ ప్రకటన

02

# హెల్ట్ పేరిట 5 లక్షల కోట్ల లూటీ




- పాలసీ పేరుతో కాంగ్రెస్ భారీ భూ కుంభకోసం
- పారిశ్రామికవేత్తలకు భూములుకట్టబెట్టే కుట్రలు
- బిఆర్ఎస్ రాగానే ఈ పాలసీని రద్దు చేస్తాం
- ఎవరైనా పెట్టుబడి పెడితే నష్టపోక తప్పదు
- జీడిమెట్ల పారిశ్రామిక కారిడార్‌ను సందర్శించిన కేటీఆర్

03




# రెండు పోలీస్ కమిషనరేట్ల వెబ్‌సైట్లు హ్యాక్

02

# గుర్తింపు కోసం నేను పనిచేయను..

**రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని శాసించనున్న ఎఐ**

**2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమికి ప్లాన్**

**నీతి ఆయోగ్ సదస్సులో భట్టి, శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, డిసెంబరు 4:** రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ప్రపంచాన్ని శాసిస్తుందని డిప్యూటీ సీఎం విక్రమార్క పేర్కొన్నారు. అయితే, తెలంగాణ 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమీకి చేరుకోవాలని ప్లాన్ చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన క్వాంటం పవర్డ్ ఎకానమీ స్ట్రాటజీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. క్వాంటం టెక్నాలజీ గురించి దేశం చర్చిస్తుంది.. దాని ఆవిష్కరణకి తెలంగాణను ఎంచుకున్నందుకు నీతి ఆయోగ్ కి ధన్యవాదాలు చెప్పుకొచ్చారు. డిజిటల్, టాలెంట్‌కి

మిగతా 2 లో






## పంచాయితీ రిజర్వేషన్లపై జోక్యం చేసుకోం : హైకోర్టు

**హైదరాబాద్,డిసెంబరు 4 :** పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. చట్టప్రకారం ఎన్నికల పక్రియలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్‌ల వ్యవహారంలో దాఖలైన ఆరు పిటిషన్‌లపై విచారించిన హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఎస్సీ, ఎస్టీ జనాభా లేని చోట కూడా ఆయా కులాలకు వార్డుమెంబర్లు, సర్పంచి రిజర్వేషన్లు కేటాయించారన్న పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచి రిజర్వేషన్లు కేటాయించడం వల్ల తప్పులు దొర్లాయని తెలిపారు. రిజర్వేషన్లు కేటాయించిన చోట సంబంధిత కులానికి చెందిన వ్యక్తులు లేకపోతే ఎన్నికల నిర్వహించబోమని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. ఎస్‌ఈసీ వాదనను రికార్డు చేసుకున్న హైకోర్టు.. పిటిషన్లపై విచారణ ముగించింది.

## హిడ్మాది బూటకపు ఎన్‌కౌంటర్

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ ప్రకటన**

**విశాఖపట్టణం, డిసెంబరు 4:** మావోయిస్టు కీలక నేత హిడ్మా ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ మరో సంచలన లేఖను విడుదల చేసింది. హిడ్మాది పూర్తిగా బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ పేరుతో లేఖ విడుదలైంది. హిడ్మాతో పాటు శంకర్లను పట్టుకుని చిత్రహింసలు పెట్టి చంపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి చెందిన కొందరు కలప వ్యాపారుల ద్రోహం వల్లనే వీళ్ళు దొరికిపోయారని మండిపడ్డారు. అనారోగ్యంతో ఉన్న హిడ్మా, శంకర్లు చికిత్స కోసం విజయవాడకు వెళ్లినట్లు చెప్పారు. కలప వ్యాపారులతో కలిసి విజయవాడకు వెళితే వాళ్ళని పట్టుకున్నారన్నారు. వారం రోజుల పాటు చిత్రహింసలకు గురిచేసి ఆంధ్రా పోలీసులు చంపేశారని ఆరోపించారు. హిడ్మా, శంకర్ల ఎన్‌కౌంటర్లపై సమగ్ర దర్యాప్తు చేయాలని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ లేఖలో స్పష్టం చేశారు. కాగా.. గత నెలలో (నవంబర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో రెండు భారీ ఎన్‌కౌంటర్లు జరిగిన విషయం తెలిసిందే. నవంబర్ 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావో కీలక నేత హిడ్మాతో పాటు ఆయన భార్య, పలువురు అనుచరులు హతమవ్వగా, నవంబర్ 19న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ శంకర్ సహా ఆరుగురు మృతి చెందారు. ఈ రెండు ఎన్‌కౌంటర్లలో మొత్తం 13 మంది మావోయిస్టులు హతమయ్యారు. అలాగే ఘటనా స్థలంలో దొరికిన డైరీలోని సమాచారం ఆధారంగా ఏపీలోని పలు జిల్లాల్లో పోలీసులు తనిఖీలు చేసి దాదాపు 50 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

## చలాన్లపై రాయితీ అవాస్తవం

**అలాంటిదేమీ లేదని ఖండించిన ట్రాఫిక్ విభాగం**




**హైదరాబాద్, డిసెంబరు 4:** ట్రాఫిక్ చలాన్లపై భారీ తగ్గింపుల పేరుతో తిరుగుతున్న ఈ ప్రచారం మొత్తం ఫేక్ అని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. పెండింగ్ చలాన్లు క్లియర్ చేసేందుకు ఇది మంచి అవకాశం అనుకుంటున్న వాహనదారులు అసత్య సమాచారానికి గురికావద్దని విజ్ఞప్తి చేశారు.ఇటీవలి రోజుల్లో ఇంటర్నెట్‌లో డిసెంబర్ 13న చలాన్లపై పూర్తి రాయితీలు ఇస్తున్నారంటూ వేగంగా ప్రచారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసులు తమ అధికారిక ట్విట్టర్ ద్వారా స్పష్టతనిచ్చారు. ఆ తేదీన ఎలాంటి లోక్ అదాలత్ నిర్వహించడంలేదని, చలాన్లపై రాయితీలకు సంబంధించిన ఎలాంటి అధికారిక నోటిఫికేషన్ ఇప్పటివరకు జారీ కాలేదని తెలిపారు. ప్రజలు ఇలాంటి తప్పుడు పోస్టులను నమ్మకుండా, మరెవరికి పంపకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఇక తరచూ చలాన్లపై డిస్కౌంట్లు ప్రకటించడం సరికాదని, అలాంటి రాయితీలు వాహనదారుల్లో భయం తగ్గించి నిబంధనల ఉల్లంఘనలు పెరిగే అవకాశముందని హైకోర్టు ఇప్పటికే వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ట్రాఫిక్ చలాన్లపై ఎలాంటి రాయితీ లేదు. పెండింగ్ చలాన్ల గురించి నమ్మకమైన, అధికారిక సమాచారం కోసం మాత్రమే పోలీసుల వెబ్‌సైట్‌లు, యాప్‌లను వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు.

## బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో 18 మంది మృతి

**వివరాలు వెల్లడించిన డీఐజీ కమలోచన్ కశ్యప్**

**రాయపూర్, డిసెంబరు 4:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపుర్-దంతెవాడ సరిహద్దు అడవుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భీకర ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో 9 మంది మహిళలతో సహా మొత్తం 18 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. బీజాపూర్‌లో డీఐజీ కమలోచన్ కశ్యప్, ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్‌తో కలిసి ఎన్‌కౌంటర్ వివరాలను గురువారం వెల్లడించారు. ఎన్‌కౌంటర్ నుంచి ప్రాణాలతో బయటపడిన మావోయిస్టులు త్వరగా లొంగిపోతే మంచిదని, లేకుంటే ప్రాణాలు పోగొట్టుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. కాల్పుల్లో మృతి చెందిన వారిపై రూ.1.3 కోట్ల రివార్డు ఉందని చెప్పారు. మృతుల్లో మావోయిస్టు పీఎల్జీ రెండో బెటాలియన్ కమాండర్ వెల్ల మోడియంతో పాటు కంపెనీ నెంబర్ 2, 7లకు చెందిన కీలక మావోయిస్టులు.. రైను ఓఎం, సన్ను అవలం, నందా మీడియం, లాలు, రాజు పూణెం, రమేష్ కవాసి, లక్ష్మి తాటి, బండి, మడ్వి, సుకీ లేఖం, సోమ్డి కుంజం, చందు కుర్శం, మాసే, రీనా మార్కం, సోనీ మడ్వి, సంగీత పద్దంగా గుర్తించామన్నారు. మరో ఇద్దరిని గుర్తించాల్సి ఉందని తెలిపారు. బస్తర్ పరిధిలో గత 19 నెలల్లో వివిధ ఎన్‌కౌంటర్లలో 469 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు ఐజీ వివరించారు. మావోయిస్టులు లొంగిపోకుంటే భద్రతా దళాలను ఎదురుకోవాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు.

# ఎయిర్‌పోర్టు నిర్మిస్తా.. పరిశ్రమలు రప్పిస్తా

మొదటి పేజీ తరువాయి



పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. అనంతరం ప్రసంగించారు. ఆదిలాబాద్ అభివృద్ధి బాధ్యత నేనే తీసుకుంటానని చెప్పుకొచ్చారు. ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్ బస్‌ను దించి.. పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారు. ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంటోంది. సంక్షేమం-అభివృద్ధి రెండుకళ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నాం. రెండేళ్లుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నా. చిన్న వయసులోనే నాకు గొప్ప అవకాశం దక్కడం.. ప్రజల దీవెన, దేవుడి సంకల్పం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాల కతీతంగా కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు విపక్ష ఎమ్మెల్యేలను ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా అనుమతించలేదు. ఎమ్మెల్యేలను కూడా సచివాలయంలోకి రాకుండా అడ్డుకున్న ప్రభుత్వాన్ని గత పదేళ్లలో చూశాం. ఏ ఆశయంతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో.. గత పదేళ్లలో అది నెరవేరలేదు. రాష్ట్ర అభివృద్ధికి తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంటరీ రూపొందించాం. పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈనెల 8, 9న గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం అని అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంద్రవెల్లి స్ఫూర్తిగానే గత ప్రభుత్వంపై నేను పోరాటం ప్రారంభించానని అన్నారు. అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరుల స్థూపం పర్యాటకంగా అభివృద్ధి చేసే దస్త్రంపై సంతకం పెట్టాను. ఆదిలాబాద్‌కు సాగునీరు అందేలా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును వైఎస్ఆర్ చేపట్టారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. మూడేళ్లకే కాళేశ్వరం కూలింది. ప్రజల సొమ్ము దోచుకుని అక్రమ సొమ్ము కోసం ఇవాళ ఆ కుటుంబంలో గొడవలు పడుతున్నారు. అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్దే నిర్మించి ఆదిలాబాద్‌కు నీరు ఇస్తాం. ఎన్నికల ఉత్సవం పూర్తి కాగానే మరో 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం అని సీఎం హామీ ఇచ్చారు.తమ్మిడిహట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కట్టితీరుతామని స్పష్టం చేశారు.ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తానే వస్తానని తెలిపారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు ఉన్నాయని వివరించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిని పర్యాటక కేంద్రంగా మారుస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు మళ్లీ వస్తానని.... రోజంతా సమస్యలపై సమీక్షిస్తానని తెలిపారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యూనికేషన్‌లో ఆదిలాబాద్ అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఆదిలాబాద్‌లో తప్పకుండా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. వర్సిటీ ఎక్కడ కట్టాలో స్థానిక నేతలంతా కలిసి ఒక నిర్ణయానికి రావాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిలో యూనివర్సిటీ కడితే బాగుంటుందని తన భావన అని తెలిపారు. అనుమతి మాత్రమే తనదని.. ఎక్కడ కట్టాలో నిర్ణయం మీదేనని చెప్పుకొచ్చారు. ఏడాదిలో 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. రాబోయే రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. మన యువత ఐఏఎస్, ఐపీఎస్‌లు అయినప్పుడే తనకు సంతోషమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బాగా చదువుకుని తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటాలన్నారు. సర్పంచ్‌లను చూసి ఎన్నుకోవాలని, పనిచేసే వారికే అవకాశం ఇవ్వాలన్నారు. రాష్ట్ర మంత్రులు వివేక్

# గుర్తింపు కోసం నేను పనిచేయను..

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్ కి కేంద్రంగా మారింది అన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా టెక్నాలజీని ప్రమోట్ చేసే పనిలో ఉన్నారు.. నీతి ఆయోగ్ కూడా గ్లోబల్ సమ్మిట్‌లో భాగస్వామ్యం కావాలని కోరుతున్నాం.. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అన్ని రంగాల పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం.. యంగ్ ఇండియా స్టార్టప్ కోసం ఫండింగ్ చేయాలని నిర్ణయించాం.. 1000 కోట్ల రూపాయలతో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. 'క్వాంటం సిటీ'గా హైదరాబాద్ ను తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీని రూపొందించా మన్నారు. గచ్చిబౌలిలోని 'ఐఐఐటీ హైదరాబాద్'లో 'నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం అండ్ తెలంగాణ క్వాంటం స్ట్రాటజీని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీలో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్‌లో ఆర్అండ్ డీ, ఇన్నోవేషన్స్ ను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. ఇది కేవలం తమ ప్రభుత్వం రూపొందించిన ఒక పాలసీ మాత్రమే కాదని, క్వాంటం టెక్నాలజీలో దేశానికి దిశా నిర్దేశర చేసే 'డైరెక్షన్' అని అన్నారు. ఈ టెక్నాలజీ లో దేశానికి ఒక బెంచ్ మార్క్ సెట్ చేసేలా ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్'కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. 'ఇండస్ట్రీ డే' పేరిట ప్రతి వారంలో ఒకరోజు అధికారులు, ప్రతి నెలలో ఒక రోజు సంబంధిత మంత్రి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు.

## పాక్‌కు సైనిక సమాచారం

**ఇద్దరిని అరెస్ట్ చేసిన గుజరాత్ ఏటీఎస్**




**న్యూఢిల్లీ,డిసెంబరు 4:** సైనిక వ్యవహారాలకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్న ఓ ఆర్మీ విశ్రాంత ఉద్యోగి, మరో మహిళను గుజరాత్ ఏటీఎస్ అరెస్టు చేసింది. ఈ ఇద్దరూ పాకిస్థానీ ఏజెంట్లతో సమాచారాన్ని పంచుకుంటున్నట్లు గుర్తించింది. సైన్యం కదలికలు, కీలక అధికారుల బదిలీల గురించి సమాచారం అందించమని అతన్ని పాక్ నిఘా సిబ్బంది ప్రలోభపెట్టినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు.. కొంతమంది సైనిక సిబ్బందిని హనీట్రాప్ చేయమని ఆ మహిళకు చెప్పారన్నారు. ఈ గూఢచర్య నెట్‌వర్క్‌కు సంబంధించిన ఆధారాలను నిందితుల ఫోన్ల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గుజరాత్ ఏటీఎస్ ఎస్పీ సిద్దార్థ్ కోరుకొండ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన అజయ్‌కుమార్ సింగ్ (47) సైన్యంలో పనిచేసి 2022లో రిటైరయ్యాడు. ప్రస్తుతం గోవాలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతడు సైన్యంలో సుబేదార్‌గా ఉన్నప్పుడే.. 'అంకిత శర్మ' పేరుతో ఓ పాకిస్థానీ నిఘా అధికారి అతన్ని సంప్రదించాడు. పరిచయం పెంచుకుని.. భారత ఆర్మీ రెజిమెంట్ల కదలికలు, కీలక ఆర్మీ అధికారుల బదిలీల వంటి సున్నితమైన సమాచారాన్ని టెక్ట్స్, ఫొటోలు, వీడియోల రూపంలో పంపించాడు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రష్మణి పాల్ (35).. 'ప్రియా ఠాకుర్' అనే నకిలీ గుర్తింపుతో పనిచేస్తోంది. డబ్బుకు ఆశపడి పాక్ ఏజెంట్లు చెప్పినట్లు.. సైనిక సిబ్బందితో స్నేహం చేయడం ద్వారా వారి నుంచి సమాచారాన్ని సేకరించినట్లు సమాచారం.

## థాంక్యూ సీఎం గారు

**రేవంత్‌రెడ్డికి బీజేపీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు**



**ఆదిలాబాద్, డిసెంబరు 4:** ఆదిలాబాద్‌కు విమానాశ్రయం కావాలని గతంలో సీఎం రేవంత్ రెడ్డిని తాను అడిగానని బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. కేంద్రం మంజూరు చేస్తే.. కావాల్సిన సహకారం అందిస్తానని సీఎం అన్నారని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్న సీఎంకు ధన్యవాదాలు తెలియజేశారు. ఆదిలాబాద్‌లో సీఎం పర్యటించారు. ఇందిరా ప్రియదర్శిని మైదానంలో బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాయల్ శంకర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్తే అంగీకరించారని, విమానాశ్రయా నికి వెంటనే 800 ఎకరాల భూసేకరణకు సీఎం ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. మాజీ సీఎం కెసిఆర్ ప్రభుత్వం ఆదిలాబాద్ విమానాశ్రయానికి భూమి ఇచ్చేందుకు ముందుకు రాలేదని విమర్శించారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా సీఎంను కలుస్తానని చెప్పారు. చనాఖా- కొరాట ప్రాజెక్టుకు పెండింగ్ నిధులు విడుదల చేయాలని, సోయాబీన్ పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని అన్నారు. ఆదిలాబాద్‌కు యూనివర్శిటీ మంజూరు చేయాలని రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నానని పాయల్ శంకర్ తెలియజేశారు.

## రెండు పోలీస్ కమిషనరేట్ల వెబ్‌సైట్లు హ్యాక్

**హైదరాబాద్, డిసెంబర్ 3:** తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాళ్లు షాకిచ్చారు. ఇటీవలే హైకోర్టు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన సైబర్ క్రిమినల్స్.. తాజాగా రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లను పనిచేయకుండా చేశారు. దీంతో గద పది రోజులుగా రెండు కమిషనరేట్ల వెబ్‌సైట్లు పూర్తిగా నిలిచిపోయాయి. వీటిలోకి మాల్‌వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వెబ్‌సైట్లను క్లిక్ చేస్తే అధికారిక సమాచారానికి బదులుగా గేమింగ్ సైట్లకు రీడైరెక్ట్ అవుతున్నట్లు గుర్తించారు. దీంతో సర్వర్లను డౌన్ చేసి వాటిని నిర్వహిస్తున్న ఎన్ఐసీకి సమాచారం అందించారు. సమస్యను పరిష్కరించేందుకు రెండు కమిషనరేట్లలోని ఐటీ బృందాలు యత్నిస్తున్నాయి. వెబ్‌సైట్ల పునరుద్ధరణకు ఎన్ఐసీ పర్యవేక్షణలో ప్రతినిధులు పనిచేస్తున్నారు. రెండు కమిషనరేట్ల పోలీస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారు. మళ్లీ హ్యాకింగ్ కాకుండా అధునాతన ఁ ÷ర్‌వాల్స్ ఆడిట్ చేస్తున్నారు. ఆడిహ్యాకింగ్‌కు కారణమైన ముఠాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయం చేస్తూ సర్వర్‌ల భద్రతను బలోపేతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కాగా, ఇదే తరహాలో పలు ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లు కూడా హ్యాక్ అయినట్లు సమాచారం. ఇప్పటికే డార్క్ వెబ్‌లో 22 వెబ్‌సైట్లకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉందని సైబర్ నిపులు చెబుతున్నారు.



# హిల్ట్ పాలసీ కాదు.. 5 లక్షల కోట్ల లూటీ

- హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ భారీ భూ కుంభకోసం
- పారిశ్రామికవేత్తలకు భూములుకట్టబెట్టే కుట్రలు
- బిఆర్ఎస్ రాగానే ఈ పాలసీని రద్దు చేస్తాం
- ఎవరైనా పెట్టుబడి పెడితే నష్టపోక తప్పదు
- జీడిమెట్ల పారిశ్రామిక కారిడార్‌ను సందర్శించిన కేటీఆర్



హైదరాబాద్, డిసెంబర్ 3: హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతున్నది బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ ఆరోపించారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు రేవంత్ సర్కార్ ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఈ పాలసీది రద్దు చేస్తామని, అవసరమైతే దీనికోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామని వెల్లడించారు. రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల బదలాయింపుపై కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావని, ప్రైవేట్ వ్యక్తులకు ప్రజలు, ప్రభుత్వం ఇచ్చిన భూములన్నారు. అందులో కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇచ్చారని గుర్తుచేశారు. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తున్నదని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో ఇండ్లకు, పాఠశాలలు, దవాఖానలు, చివరికి స్మశానాలకు స్థలం లేదు.. కానీ ప్రైవేట్ వ్యక్తులకు 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటున్నదని మండిపడ్డారు. ఈ 9300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని అక్కడ కాంగ్రెస్ చెప్తున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూళ్లు, హాస్పిటళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టలేదన్నారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలి వెళ్తే హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిర్ధారణ జరగాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ ఇక్కడితో వదిలిపెట్టదని, కాంగ్రెస్ పార్టీ హిల్ట్ పాలసీ కుంభకోణంపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలోని కాలనీల ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తామని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని చెప్పారు. అనుముల రేవంత్ రెడ్డి కాదని, అవినీతి అనకొండ అని విమర్శించారు. 9300 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసి లక్షల కోట్ల రూపాయలు దోచుకొని ఢిల్లీకి మూటలు పంపడానికి చేస్తున్న ఈ స్కామ్ ను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీని వెనక్కి తీసుకొని లక్షల కోట్ల విలువచేసే ప్రజల భూమిని కాపాడే దాకా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని చెప్పారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారని వెల్లడించారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై తాము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయిందంటూ ప్రభుత్వం బాధపడుతున్నదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీడిమెట్ల ప్రాంతంలో గజానికి మార్కెట్ ధర లక్ష రూపాయలుగా ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కే భూమిని పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని చెబుతున్నదని విమర్శించారు. ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుంభకోణానికి ఇది నిదర్శనమన్నారు. భూముల దోపిడీ ఆర్నెళ్లుగా జరుగుతున్నదని, పాలసీ ఇప్పుడు బయటకు వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీని కార్మిక సంఘాలు అడ్డుకోవలన్నారు.

# కోతుల సమస్యతో రైతుల పరేషన్

## జాతీయ సమస్యగా గుర్తించి చర్యలు తీసుకోవాలి

## లోక్‌సభలో ప్రస్తావించిన బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** కోతుల బెడదతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పెద్దమొత్తంలో వానరాలు పంటలను పాడు చేస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఈ సమస్యను నివారించేందుకు జాతీయ స్థాయిలో కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కోతుల సమస్యపై గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఈ సమస్య తమ శాఖ కిందకు రాదని కొన్ని ప్రభుత్వ శాఖలు తప్పించుకుంటున్నాయని.. వానరాల సమస్య ఏ శాఖ కిందకు వస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. కోతుల సమస్య చిన్న విషయం లాగా అనిపిస్తోందని.. కానీ అందరూ ఈ సమస్య గురించి తెలుసుకుని నవ్వుతారని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు దేశంలోని చాలా రాష్ట్రాల్లో కోతుల సమస్య ఉందని గుర్తుచేశారు. విషయంలో నోడల్ ఏజెన్సీ అవసరమని చెప్పారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కోతుల సమస్యను ప్రజలు ప్రస్తావిస్తున్నారని గుర్తు చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కూడా ఈ సమస్య ఒక ఎజెండాగా మారిందని పేర్కొన్నారు. వానరాల సమస్యను పరిష్కరిస్తే సర్పంచ్‌గా గెలిపిస్తామని ప్రజలు అంటున్నారని.. దేశ రాజధాని ఢిల్లీలో కూడా ఈ సమస్య తీవ్రంగా ఉందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు.

# అఖండ విడుదలపై ఆంక్షలు

## మద్రాస్ హైకోర్టు ఆదేశాలు




**చెన్నై,డిసెంబర్4 :** నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ' సినిమా సీక్వెల్ అయిన 'అఖండ 2' విడుదలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ సినిమా విడుదలపై తాత్కాలిక నిషేధం విధిస్తూ డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్ 'అఖండ 2' సినిమా థియేట్రికల్, డిజిటల్ విడుదలలన్నింటినీ నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ ÷ూ.ఓ. సుబ్రమన్యం మరియు జస్టిస్ అ. కుమారప్పన్ లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ ఆంక్షలను విధించింది. ఈ కేసులో పిటిషనర్‌గా ఉన్న ఎరోస్ ఇంటర్నేషనల్ మీడియా లిమిటెడ్ పక్షాన కోర్టు ఈ తీర్పును ఇచ్చింది. ఎరోస్ సంస్థ ప్రధానంగా 14 రీల్స్ ప్లస్ ఎల్ఎల్‌పిపై తీవ్ర ఆరోపణలు చేసింది. సినిమా నిర్మాతలు తమకు చెల్లించాల్సిన ?28 కోట్లు చెల్లించకుండానే సినిమాను విడుదల చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఎరోస్ ఆరోపించింది. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ కు అనుబంధ సంస్థ అయిన 14 రీల్స్ ప్లస్ ఎల్ఎల్‌పి సినిమా విడుదల ఎ÷-లాన్ చేసిందని ఎరోస్ వాదించింది. ఎరోస్ ఇంటర్నేషనల్ తరపున సీనియర్ కౌన్సిల్‌లు తమ వాదనలు వినిపించారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం, కోర్టు తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు 'అఖండ 2' సినిమాను ఏ రూపంలోనూ విడుదల చేయడం అసాధ్యం అని అంటున్నారు.

# బాలు విగ్రహాన్ని అడ్డుకోవడం దారుణం

- రోశయ్య, బాలసుబ్రమణ్యం ఒకప్రాంతం వారు కాదు
- బీఆర్ఎస్ సెంటిమెంట్ రాజకీయాలు ఆపాలి
- రోశయ్య వర్ధంతి సభలో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



**హైదరాబాద్, డిసెంబర్ 3:** తెలంగాణ సెంటిమెంట్‌తో భారత రాష్ట్ర సమితి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రాంతానికి చెందిన వారు కాదనిమహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నగరంలోని రవీంద్ర భారతిలో ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభలో మహేష్‌గౌడ్ పాల్గొని ప్రసంగించారు. బాలసుబ్రహ్మణ్యం విగ్రహం రవీంద్ర భారతిలో పెడితే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. సెంటిమెంట్ రగల్చి బీఆర్ఎస్ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దేవుళ్ల విషయంలో సీఎం ఒక సామెతగా చెప్పారని.. దాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. బీఆర్ఎస్ కోసమే కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని ఆరోపించారు. హిల్ట్ పాలసీ ద్వారా హైదరాబాద్‌లో సామాన్యులకు భూముల ధరలు అందుబాటులో వస్తాయని మహేష్ గౌడ్ వెల్లడించారు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్ మారుతుందని తెలిపారు. అవినీతికి అలవాటు పడ్డ కేసీఆర్ కుటుంబం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా అవినీతి అని ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ విమర్శించారు. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభను రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ దయానంద్, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, జగ్గారెడ్డి, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి నేతలు నివాళు లర్పించారు. రోశయ్య వర్ధంతి సందర్భంగా వి.హనుమంతరావును రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ సత్కరించింది. అలాగే రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పేద విద్యార్థులకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ స్కాలర్ షిప్‌లు అందజేశారు.



# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

## హైదరాబాద్ విమానం అహ్మదాబాద్‌కు మళ్లింపు

**హైదరాబాద్,డిసెంబరు 4:** షార్జా నుండి హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో విమానాన్ని అత్యవసరంగా అహ్మదాబాద్‌కు మళ్లించారు. ఈ సంఘటన ప్రయాణికులలో, విమానాశ్రయ అధికారులలో కలకలం సృష్టించింది. ఇండిగో విమానానికి సంబంధించిన అధికారులకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు అందింది. విమానంలో మానవ ఐఈడీ ఉన్నట్లుగా ఈ మెయిల్ ద్వారా బెదిరించినట్లు తెలిసింది. బెదిరింపు రాగానే అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, విమానాన్ని దాని గమ్యస్థానం హైదరాబాద్‌కు కాకుండా అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మళ్ళించారు. అహ్మదాబాద్‌లో విమానం ల్యాండ్ అయిన వెంటనే, ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించారు. అనంతరం భద్రతా సిబ్బంది బాంబు స్క్వాడ్‌తో కలిసి విమానంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపులు రావడం ఇది రెండవసారి. గతంలో, కువైట్ నుండి హైదరాబాద్‌కు రావాల్సిన మరో విమానానికి బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో, ఆ విమానం ఉదయం 7:45 గంటల ప్రాంతంలో ముంబై ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయింది. అప్పుడు కూడా ప్రయాణికులను దించి, బాంబు డిస్పోజల్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించాయి.

# యువకుడి దారుణ హత్య

## రియల్ వ్యాపారి జునైద్‌గా గుర్తింపు

**హైదరాబాద్, డిసెంబరు 4:** హైదరాబాద్ నగరంలోని పాతబస్తీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. రెయిన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి కత్తి పోట్లతో పడి ఉన్నట్లు పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు బాధితుడిని హుటాహుటిన సంతోష్‌నగర్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. అయితే తీవ్రంగా గాయపడిన సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు పాతబస్తీ రెయిన్ బజార్‌కు చెందిన మహమ్మద్ జునైద్ (30)గా గుర్తించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన జునైద్‌ను కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు విచక్షణారహితంగా కత్తులతో పొడిచారని.. తీవ్రంగా గాయపడిన జునైద్‌ను ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందాడని పోలీసులు తెలిపారు. అనంతరం జునైద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ హత్యకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ మొదలుపెట్టారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. అయితే నిందితులు, బాధితుడు ఇద్దరూ కూడా బంధువులే అని అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్ సుందర్ తెలిపారు. జునైద్‌ను ఎందుకు హత్య చేశారనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు.

# ఏసీబీ వలలో ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్


## దాదాపు వందకోట్ల ఆస్తుల గుర్తింపు



**హైదరాబాద్, డిసెంబరు 4:** అక్రమాస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. దాదాపు వందకోట్ల ఆస్తులు ఉన్నట్లుగా గుర్తించారు. ఏడీ శ్రీనివాస్ నివాసం, బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు తెలంగాణ, ఏపీ, కర్ణాటకల్లో భారీగా ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు. మొత్తం ఆరు ప్రాంతాల్లో సోదాలు చేసిన అధికారులు.. రాయదుర్గం మైహోంభుజలో ఫ్లాట్, కర్ణాటకలో 11 ఎకరాల వ్యవసాయ భూమి, అనంతపురంలో 11 ఎకరాలు, మహబూబ్‌నగర్‌లో నాలుగు ప్లాట్లు, నారాయణపేటలో రైస్ మిల్లు, 3 ప్లాట్లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. సోదాల్లో రూ.5లక్షల నగదు, 1.6 కిలోల బంగారం, 770 గ్రాముల వెండి, 2 కార్లు, పలు పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# ఉద్యోగాల పేరిట ఎర

## సైబర్ క్రైమ్ ఉచ్చులో దింపడం ■ మోసగాళ్ల ముఠా గుట్టు రట్టు



**హైదరాబాద్, డిసెంబరు 4:** నిరుద్యోగులే వారి టార్గెట్.. విదేశాల్లో మంచి ఉద్యోగం అని చెబుతారు.. లక్షల్లో జీతం, అన్ని రకాల సౌకర్యాలుంటాయని నమ్మబలుకుతారు.. విదేశాలకు పంపిస్తారు.. విదేశాల్లో ఉద్యోగం అని ఎన్నో ఆశలతో వెళ్లిన నిరుద్యోగులకు చేయకూడని పనులన్నీ చేయిస్తారు. విదేశీ ఉద్యోగం పేరుతో సైబర్ క్రైమ్ కాల్ సెంటర్లకు నిరుద్యోగ యువతను పంపుతున్న మోసగాళ్ల ముఠా గుట్టు రట్టు అయింది. నిరుద్యోగ యువతను ఆకర్శించి మోసాలకు పాల్పడుగున్న సైబర్ క్రైం ఏజెంట్ల గ్యాంగ్ ను పోలీసులు పట్టుకున్నారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి అక్కడ సైబర్ క్రైం చేయిస్తున్న ఏజెంట్ల గ్యాంగ్ ను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఉద్యోగాల పేరుతో యువతను మియన్మార్, థాయ్‌లాండ్‌కు తరలిస్తున్న హైదరాబాద్, విశాఖపట్నం, మైసూర్ కు చెందిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. సైబర్ నేరాలకు సంబంధించి ఈ గ్యాంగ్ పై పలు కేసులు నమోదు చేశారు. విదేశీ ఉద్యోగాల పేరుతో పొంచివున్న ప్రమాదంపై యువత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.



## సంపాదకీయం

# సవాల్ విసురుతున్న గంజాయి మాఫియా!

గంజాయి మాఫియా విజృంభిస్తోంది. తాజాగా నెల్లూరు జిల్లాలో గంజాయి మాఫియా గ్యాంగ్ ఘాతుకానికి కొట్టాచిట్టం పెంచలయ్య బలయ్యారు. ఇది ఆరంభం మాత్రమే. ఎందుకంటే ఇప్పటి వరకు గంజాయి మాఫియా పట్టుబడడం లేదా తప్పించుకోవడం మాత్రమే చూశాం. ఇక హత్యలకు సంకేతం అన్నట్లుగా పెంచలయ్య మర్డర్‌ను భావించాలి. పెంచలయ్యను చంపిన దుర్మార్గులను వారి వెనకనున్న డాన్‌లపైన దృష్టి పెట్టాల్సి ఉంది. ఈ విషయంలో ఎపి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి. ఎందుకంటే గంజాయి చాపకింద నీరులా ప్రవహిస్తోంది.కాసులు కురిపించడంతో పలువురు దీనికి ఆకర్శితులై కుటీరపరిశ్రమగా వాడుకుంటున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇది బాగా విస్తరించింది. అన్ని ప్రాంతాలలో విచ్చలవిడిగా గంజాయిని సరఫరా చేస్తున్నారు. దీనితో విద్యార్థులు యువత చెడుదారి పడుతున్నారు. డ్రగ్స్ మాఫియాల వెనక రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వారిపై ఉక్కుపాదం మోపి, తక్షణం డ్రగ్స్, గంజాయి తదిర మాఫియాలను నిర్మూలించాల్సి ఉంది. ఎందుకంటే మద్యం, గంజాయి, డ్రగ్స్ మాఫియాలను అరికట్టకపోతే సమాజం దారి తప్పుతుంది. పాలకులు ఎంతసేపు పెన్షన్ల పంపిణీ, బియ్యం పంపిణీలపై దృష్టి పెట్టడం మానాలి. హెలికాప్టర్లు వేసుకుని ఊరేగడం మానాలి. హెలికాప్టర్, విమానాల్లో తిరగడానికి వందల కోట్లు తగలేస్తున్నారు. ఆ డబ్బులను మాఫియాలను అరికట్టేందుకు వినియోగించాలి. ప్రజా చైతన్య కార్యక్రమాలను చేపట్టాలి. విశాఖ,మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి విచ్చలవిడిగా సాగవుతోంది. అక్కడ నుంచి జిల్లాలోకి అక్రమంగా గంజాయి రవాణా అవుతోంది. ముఖ్యంగా ఒడిశా, అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఎక్కువగా వస్తోంది. మారేడుమిల్లి, రంపచోడవరం మీదుగా జగ్గంపేటకు గంజాయి రావాణా సాగుతోంది. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా ఎగుమతి అవుతోంది. ఇటీవల తెలంగాణలో కూడా విచ్చల విడిగా గంజాయి ప ట్టుబడుతోంది. అయితే పట్టుబడుతున్న గంజాయి లేదా డ్రగ్స్ కొంత మాత్రమే. ఇప్పటికే అది గుట్టుచప్పుడు కాకుండా రవాణా అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వాలు తలచుకుని గట్టిగా చర్యలు తీసుకుంటే దీనిని అరికట్టవచ్చు. మొగ్గలోనే దీనిని తుంచివేయాలి. ఈగిల్ టీమ్‌లకు మరింత బలగాలను ఇచ్చి అదేపిగా తనిఖీలు చేపట్టాలి. ఎక్కడెక్కడ పండిస్తున్నారో గుర్తించి ధ్వంసం చేయాలి. అయితే పోలీసులు నిఘా పెట్టి అరెస్టులు చేస్తున్నా గంజాయి రవాణా మాత్రం ఆగట్లేదన్న ఆరోపణలే ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా నగరాల్లో విద్యార్థులు, యువతను టార్గెట్ చేస్తున్నారు. అందుకే పట్టణ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. యువత, విద్యార్థులనే గంజాయి మాఫియా టార్గెట్ చేసుకుంటోంది. ఒంటరిగా, జులాయిలా తిరిగే యువకులను రవాణాకు ఉపయోగించుకుంటోంది. గంజాయిని చిన్నచిన్న పొట్లాలు, లిక్విడ్, చాక్లెట్లుగా మార్చి యువతకు, విద్యార్థులకు అమ్ముతున్నారు. ఎక్కువగా ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల యువతనే వీరు లక్ష్యంగా చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. ఇటీవల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలు సందర్భాల్లో ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు గంజాయి సేవిస్తూ పోలీసులకు చిక్కారు. కొన్నిచోట్ల రాజకీయ పలుకుబడితో కేసు నుంచి వారు తప్పించుకున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. గత జగన్ ప్రభుత్వ హయాంలో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. ప్రస్తుత ప్రభుత్వ హయాం లోనూ పరిస్థితిలో పెద్దగా మార్పు కానరావడంలేదు. మేము అధికారంలోకొస్తే గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపుతాం అని టిడిపి అధినేత చంద్రబాబు చెప్పుకొచ్చారు. అధికారంలోకొచ్చి ఏడాదిన్నర అయినా గంజాయికి అడ్డుకట్ట పడడంలేదు. గత ప్రభుత్వం లో మాదక ద్రవ్యాలు, గంజాయి రాష్ట్రమంతటా పాకాయి. వాటి మూలాలను గుర్తించి నివారించాలి. యువతను గంజాయి మత్తు నుంచి బయటకు తీసుకురావాలి. మాదకద్రవ్యరహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించాలి. ఇప్పటికీ గంజాయి మాఫియా రెచ్చిపోతోందనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు పాలకపక్షం లోని కొందరి అండదండలే కారణమని ప్రచారం జరుగుతోంది. తాజాగా నెల్లూరు ఘటన దీనికి పరాకాష్టగా చూడాలి. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న పెంచలయ్యను దారుణంగా హత్య చేయడం దారుణంకాక మరోటి కాదు. ఈ ఘటనతో స్థానికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రధాన హంతకుడు జేమ్స్ ఇంటిని వారు దగ్ధం చేశారు. నెల్లూరు నగరంలోని అయ్యప్పగుడి ప్రాంతంలోని ఆర్‌డిటి కాలనీలో పెంచలయ్య ఉంటున్న వీధిలోనే జేమ్స్ కుటుంబం ఉంటోంది. జేమ్స్ అక్క అరవ కామాక్షి గంజాయి, మాదక ద్రవ్యాలు, దొంగతనాలకు యువకుల ను ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో పెంచలయ్య తన స్నేహితులతో కలిసి గంజాయి అమ్మకాలు, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. కామాక్షి తమ కాలనీకి రావద్దంటూ స్థానికులు నిర్ణయం చేశారు. దీంతో, కక్ష పెంచుకున్న జేమ్స్ మరికొందరితో కలిసి పెంచలయ్య ను హత్య చేశారని స్థానికులు చెబుతున్నారు. గంజాయిని అమ్మవద్దంటే చంపేస్తారా? అంటూ స్థానిక మహిళలు, యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్లో చైతన్యం తీసుకుని వస్తే వారే దీనిపై పోరాడుతారు. వారే సమాచారం ఇస్తారు. ఇక తెలంగాణలోనూ ఇటీవల ఈగిల్ టీమ్ దాడులు పెంచింది. పెద్ద ఎత్తున దాడులు చేస్తూనే ఉంది. ఇటీవల ఢిల్లీలో కూడా దాడులు చేసింది. అయినా మత్తు మాఫియాదే పైచేయి అవుతోంది. దీనిని కఠినంగా అణచివేయాలి. అందకు చిత్తశుద్ధితో కృషి చేయాలి. రవాణా జరుగుతున్న తీరును గుర్తించి మాటువేయాలి. విశాఖ నుంచి గంజాయి సరఫరా అవుతోంది. భద్రాచలం ఏజెన్సీ నుంచి కూడా వస్తోంది. ఈ రెండు ప్రాంతాల్లో గజాయి తోటలను ధ్వంసం చేస్తూ పోవాలి. అప్పుడే కొంతలో కొంతయినా విజయం సాధించవచ్చు.

# వెల్కమ్ పుతిన్‌జీ



- భారత్ చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్
- ఘనంగా స్వాగతం పలికిన ప్రధాని మోడీ
- ఇరువురు నేతలు కలిసి ప్రధాని నివాసానికి చేరిక
- నేడు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 4:** రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు చేరుకున్నారు. దిల్లీ సమీపంలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దిగిన ఆయనకు ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ఇద్దరు నేతలు ఒకే కారులో ప్రధాని అధికారిక నివాసానికి ప్రయాణమయ్యారు. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా రెండు రోజుల పాటు ఇండియా పర్యటనకు వచ్చారు. ప్రధాని నరేంద్రమోడీ ఆయనను స్వయంగా ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతించారు. పుతిన్ 23వ ఇండియా-రష్యా శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. రెండు దేశాల మధ్య రక్షణ, వాణిజ్య రంగాలలో పలు కీలక ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభానికి కొన్ని నెలల ముందు 2021 డిసెంబరులో పుతిన్ చివరి సారి దిల్లీలో పర్యటించారు. ఆ తర్వాత ఆయన మన దేశానికి రావడం ఇదే తొలిసారి. రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు అమలు చేస్తున్న వేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పుతిన్ కు ప్రధాని మోదీ ప్రైవేటు విందు ఇవ్వనున్నట్లు సమాచారం. శుక్రవారం ఇరునేతలు ఇండియా-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పలు రక్షణ, వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. భారత్‌తో సంబంధాలు, సహకారాన్ని మరింత పెంపొందించుకోవడా నికి రష్యా ఎదురు చూస్తోందని పుతిన్ ఇప్పటికే తెలిపారు. ఇంధనం, పరిశ్రమలు, అంతరిక్షం తదితర రంగాల్లో అనేక ఉమ్మడి ప్రాజెక్టులు పూర్తి చేసుకోవడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భారత్ నుంచి దిగుమతులు మరింత పెంచుకునే అంశంపైనా చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు. గురువారం వ్లాదిమిర్ పుతిన్ పాలం వైమానిక దళ స్టేషన్‌లో దిగగా ప్రధాని మోదీ ఆయనకు స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 11.00: పుతిన్ రాష్ట్రపతిని కలిసేందుకు రాష్ట్రపతి భవన్‌కు వెళతారు. ఉదయం 11.30కు రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పిస్తారు.ఉదయం 11.50: నరేంద్ర మోదీతో సమావేశం.మధ్యాహ్నం 1.50: హైదరాబాద్ హౌస్‌లో సంయుక్త విలేకరుల సమావేశం ఉంటుంది. సాయంత్రం 7.00 గంటలు: పుతిన్ రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశం అవుతారు.రాత్రి 9.00 గంటలకుఆయన తన పర్యటనను ముగించుకుని భారతదేశం నుండి బయలుదేరుతారు. పుతిన పర్యటన సందర్భంగా ఢిల్లీలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



# హెల్త్ సెక్యూరిటీ బిల్లు

### లోక్‌సభలో ప్రవేశ పెట్టిన నిర్మలమ్మ

న్యూఢిల్లీ, డిసెంబరు 4: లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ హెల్త్ సెక్యూరిటీ సెస్, నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025ను ప్రవేశపెట్టారు. రెండు ప్రయోజనాల రీత్యా కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఒకటి ఆరోగ్య భద్రత, రెండు జాతీయ భద్రత ఈ రెండు అంశాలపై ఈ బిల్లును రూపొందించినట్లు సీతారామన్ తెలిపారు. ఆరోగ్యానికి హాని కలిగించే వస్తువులపైనే ఉదాహరణకు పాన్ మసాలా వంటి వస్తువులపై పన్ను విధించబడుతుందని ఈ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్మలాసీతారామన్ స్పష్టం చేశారు. కాగా, ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపీలు వ్యతిరేకించారు. ప్రభుత్వం ధూమపానం చేసేవారిపై పన్ను విధిస్తుంటే.. ఢిల్లీ గాలి మాత్రం మరింత విషపూరితంగా ఉందని సిపిఐ(ఎం) ఎంపీ శివదాసన్ ఎద్దేవా చేశారు. దీనిపై ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలే స్పందించారు. ఈ బిల్లుని తేవడం మంచిదే కానీ.. సెస్ రూపంలో పన్నులు ఎందుకు వసూలు చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. దీని ద్వారా పన్నుల ద్వారా ఆదాయం పెరుగుతుంది. కానీ ఈ ఆదాయం రాష్ట్రాలకు అందదు అని కేంద్రంపై ఆమె ఆరోపించారు. బిల్లు చర్చ సందర్భంగా బీడి మాత్రం 40 శాతం స్లాబ్‌లోకి వెళ్లలేదు. 28 శాతం స్లాబ్ లేనందున బీడి 18 శాతం శ్లాబ్ కిందకి వచ్చింది అని నిర్మలా సీతారామన్ అన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం అదనపు సిబ్బంది

### రాష్ట్రాలకు సుప్రీం కీలక సూచన



**న్యూఢిల్లీ, డిసెంబర్ 4:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలని సుప్రీం కోర్టు ఆయా రాష్ట్రాలకు సూచించింది. ఈ పక్రియ కొనసాగుతున్న రాష్టాల్లో బూత్ స్థాయి అధికారులు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పలువురు బీఎల్‌వోలు అనారోగ్యానికి గురి కావడం, రాజీనామాలు చేస్తుండటం, పలువురు ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు కలవరపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం కోర్టు కీలక సూచనలు చేసింది. బీఎల్‌వోల పని గంటలను తగ్గించేందుకు అదనపు సిబ్బందిని నియమించే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది. నిర్ణీత సమయంలో విధులు నిర్వర్తించనందుకుగానూ బీఎల్‌వోలపై బలవంతపు చర్యలు తీసుకోవద్దంటూ ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ నటుడు విజయ్‌కు చెందిన టీవీకే పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. తీవ్ర పని ఒత్తిడి కారణంగా అనేక మంది బీఎల్‌వోలు మరణించారని, విధులు నిర్వర్తించడంలో విఫలమైతే వారిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారని టీవీకే తరఫు న్యాయవాది వాదించారు. ఈ నేపథ్యంలో కొన్ని సూచనలు జారీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఎల్‌వోలపై పని ఒత్తిడిని తగ్గించేందుకు అదనపు సిబ్బందిని నియమించడాన్ని రాష్ట్రాలు పరిగణించొచ్చని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఎస్ఐఆర్ కోసం అవసరమైన సిబ్బందిని కేటాయించాల్సిన బాధ్యత సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై ఉంది. అవసరమైతే వారి సంఖ్య పెంచొచ్చని సుప్రీం కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.



# రాహుల్ గాంధీకి సుప్రీంలో ఊరట

### భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసు

### ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఉపశమనం లభించింది. రాహుల్‌గాంధీపై ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులను 2026, ఏప్రిల్ 22 వరకు పొడిగించింది. రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ సతీష్ చంద్రలతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఈ అంశాన్ని వివరంగా విచారిస్తామని తెలిపింది. 2022లో చేపట్టిన భారత్ జోడోయాత్రలో రాహుల్‌గాంధీ భారత సైన్యంపై అవమానకరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై ఫిర్యాదుదారు ఉదరు శంకర్ శ్రీవాస్తవ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ట్రయల్ కోర్టు సమన్లు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు మే 29న కొట్టివేసింది. దీంతో ఈ ఉత్తర్వులపై రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది ఆగస్టు 4న రాహుల్ గాంధీ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. తదుపరి విచారణ తేదీ వరకు స్టే విధించింది.

# చురుకుగా జైషే ఉగ్రవాద కూటమి

- జోరుగా మహిళల రిక్రూట్‌మెంట్
- రూ.500 ఫీజుతో గంటపాటు శిక్షణ



**ఇస్లామాబాద్, డిసెంబర్ 4:** పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే తన కార్యకలాపాలను విస్తరించేందుకు మహిళలతో ఏర్పాటు చేసిన ఉగ్రవాద గ్రూప్ చురుకుగా పనిచేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే దీనికి మహిళల నుంచి మంచి స్పందన వస్తోందని ఆ సంస్థ ప్రకటించుకుంది. మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ మహిళా గ్రూపుకు నేతృత్వం వహిస్తున్నారు. 'జమాతుల్-ముమినాత్' పేరుతో ఓ ప్రత్యేక యూనిట్‌ను తయారు చేస్తున్నది. అయితే, కొద్ది వారాల వ్యవధిలోనే వేల సంఖ్యలో మహిళల్ని ఆకర్షించి నట్లు తేలింది. ఈ విషయాన్ని స్వయంగా మసూద్ అజారే సోషల్ మీడియా వేదికగా వెల్లడించడం గమనార్హం. ఉగ్రవాద సంస్థ మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోందని జైష్ చీఫ్ మసూద్ అజార్ అందులో పేర్కొన్నారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 'జైషే మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోంది. చాలా తక్కువ సమయంలోనే 5,000 మందికిపైగా మహిళలు చేరారు. ఇదంతా అల్లా దయ వల్లే జరిగింది. చాలా మంది సోదరీమణులు నియామకం పొందిన వెంటనే తమ మానస్థిక స్థితిమారిపోయినట్లు చెబుతున్నారు. జీవిత లక్ష్యాన్ని గ్రహించినట్లు చెప్పారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి జిల్లాకు ఒక ముంటాజియా (మేనేజర్) ఉంటారు' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. కాగా, పలు నివేదికల ప్రకారం.. జమాతుల్-ముమినాత్ కోసం నియామక డ్రైవ్ ఈ ఏడాది అక్టోబర్ 8న జైషే ప్రధాన కార్యాలయం మర్కజ్ ఉస్మాన్-ఓ-అలీలో ప్రారంభమైంది. ఈ డ్రైవ్‌లో భాగంగా పాక్‌లోని బహవల్‌పూర్, ముల్తాన్, సియాల్‌కోట్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లి నుంచి మహిళలను ఉగ్రవాద సంస్థలోకి చేర్చుకున్నారు. ఈ సంస్థ రూ.500 ఫీజుతో 40 నిమిషాలు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తూ.. మహిళల్ని ఉగ్రవాదం వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఐఎస్ఐఎస్, హమాస్, ఎల్‌టీటీఈ తరహాలో ఫిదాయిన్ (ఆత్మాహుతి) దాడులు నిర్వహించడానికి ఈ మహిళలతో ఉగ్రవాద బ్రిగేడ్‌లను ఏర్పాటు చేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది.

# ప్రపంచస్థాయి ప్రమాణాలతో క్రియేటివ్ సిటీ

మొదటి పేజీ తరువాయి

అధ్యక్షతన 55వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజధాని నిర్మాణానికి సంబంధించి పలు కీలక ప్రతిపాదనలకు అథారిటీ ఆమోదముద్ర వేసింది. రాజధాని భవనాల డిజైన్ల కోసం గతంలోనే విస్తృతమైన అధ్యయనం చేశామని సీఎం గుర్తుచేశారు.



### కీలక నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్

అమరావతిలోని గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో గవర్నర్ నివాస సముదాయమైన 'లోక్ భవన్' నిర్మాణానికి అథారిటీ ఆమోదం తెలిపింది. ఈ భవనాన్ని రూ.169 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. అదేవిధంగా, రూ.165 కోట్ల అంచనా వ్యయంతో ఏపీ జ్యుడీషియల్ అకాడెమీ నిర్మాణ ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించింది. వీటితో పాటు 2024-25 వార్షిక గణాంకాల నివేదికలను కూడా అథారిటీ ఆమోదించింది. రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పన కోసం నాబార్డు నుంచి రూ.7,380 కోట్ల భారీ రుణాన్ని స్వీకరించేందుకు ముఖ్యమంత్రి నేతృత్వంలోని సీఆర్డీఏ అథారిటీ అంగీకారం తెలిపింది. ఈ-3 సీడ్ యాక్సెస్ రహదారిని జాతీయ రహదారి-16తో అనుసంధానించే పనుల కోసం రూ.532 కోట్లతో టెండర్లను పిలిచేందుకు కూడా అనుమతి ఇచ్చింది.

### నీరుకొండపై తెలుగు వైభవం.. ఎన్టీఆర్ విగ్రహం

తెలుగువారి ఆత్మగౌరవాన్ని, వైభవాన్ని చాటిచెప్పేలా నీరుకొండ వద్ద దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇది కేవలం ఒక విగ్రహంగా కాకుండా, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు, అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల జీవిత విశేషాలు, రాష్ట్ర వనరులను ప్రతిబింబించే ఒక చారిత్రక కట్టడంగా నిలవాలన్నారు. ఈ ప్రాజెక్టు కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్న ఉత్తమ ప్రాజెక్టులను అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఇది తెలుగు ప్రజలందరి ప్రాజెక్టుగా, వారి భాగస్వామ్యంతోనే నిర్మాణం చేపట్టాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

### నిర్మాణాల్లో వేగం, నాణ్యత ముఖ్యం

ప్రస్తుతం రాజధాని పరిధిలో 85 పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. ప్రభుత్వ భవనాలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఉద్యోగుల నివాస సముదాయాలతో పాటు రహదారులు, విద్యుత్, నీటి సరఫరా వంటి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, నిర్మాణాల్లో వేగంతో పాటు నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్దేశించిన గడువు కంటే ముందే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సీఆర్డీఏ పరిధిలోని పలు ప్రాంతాల్లో సుందరీకరణ పనులు కూడా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, సీఆర్డీఏ, ఏడీసీ అధికారులు పాల్గొన్నారు.

# ఆరు కంపెనీలకు ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాలు

**అమరావతి :** ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాల కింద ఆరు కంపెనీలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. పెట్టుబడులపై పోర్టల్ ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని నిర్ణయించారు. నిర్ణీత కాలపరిమితిలో ఎంవోయూల అమలుకు వీలుగా చర్యలు చేపట్టాలని తీర్మానించారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 13వ ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. అనంతరం మంత్రులు టీజీ భరత్, కందుల దుర్గేశ్ మీడియాతో మాట్లాడారు. సీఐఐ సదస్సు, అంతకుముందు ఒప్పందాల్లో 50శాతం మేర ప్రక్రియ మొదలైనట్లు తెలిపారు. పెట్టుబడుల ద్వారా 16.13 లక్షల మందికి ఉపాధి కలగనుంది. దావోస్ ఫోరమ్‌కు ముందే వీలైనన్ని శంకుస్థాపనలు జరగాలని ఎస్ఐపీబీ నిర్ణయించింది. రూ. వెయ్యి కోట్లకు పైగా పెట్టుబడులకు డెడికేటెడ్ అధికారిని ప్రభుత్వం నియమిస్తుంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. విశాఖ పరిధిలో రూ.1.69 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రక్రియ మొదలైంది. అమరావతి పరిధిలో రూ.87 వేల కోట్లు, తిరుపతి పరిధిలో రూ.73 వేల కోట్ల పెట్టుబడులకు ప్రక్రియ మొదలైంది. తాజా సమావేశాల్లో రూ.8.29 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. 45 రోజుల్లో క్షేత్రస్థాయిలో అమలయ్యేలా కార్యాచరణ రూపొందిస్తాం. రూ.13.25 లక్షల కోట్లకు సంబంధించి ఎంవోయూలు జరిగాయి. పర్యాటక రంగంలో రూ.21 వేల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయి. విద్యుత్ రంగంలో రూ.4.54 లక్షల కోట్లు, ఇండస్ట్రీస్, కామర్స్‌లో రూ.2.02లక్షల కోట్లు, ఐటీ రంగంలో రూ.1.22 లక్షల కోట్లు, ఫుడ్ ప్రాసెసింగ్‌లో రూ.8,519 కోట్లు, సీఆర్డీఏకు సంబంధించి రూ.45 వేల కోట్లు, మారిటైమ్ బోర్డు కింద రూ.1.6 లక్షల కోట్ల మేర ఎంవోయూలు కుదిరాయి' అని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఎనర్జీ సెక్టర్‌లో 40శాతం ఎంవోయూలు జరిగాయని మంత్రి టీజీ భరత్ వ్యాఖ్యానించారు. పోర్టల్‌లో ఎంవోయూలు అప్‌లోడ్ చేశామని.. ఇవీ ఏ స్థాయిలో ఉన్నాయో ఎప్పటికప్పుడు తెలిసేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరానికి వెళ్లే లోపు వీలైనన్ని గ్రౌండ్ అయ్యేలా చూడాలని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. జనవరి 18వ తేదీలోగా గ్రౌండ్ చేయడం ద్వారా రూ. 1000 కోట్ల పెట్టుబడి ఏపీకి వస్తే వారికి ఓ ఆఫీసర్ ప్రత్యేకంగా ఫాలోఅప్ అవుతారని చెప్పుకొచ్చారు మంత్రి టీజీ భరత్. ప్రపంచం మొత్తంలో విశాఖపట్నంలో ఏర్పాటు చేసే గూగుల్‌కు ఒక బజ్ వచ్చిందని వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో తాము ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మంత్రులు, పారిశ్రామిక వేత్తలు, అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకున్నారని తెలిపారు. విశాఖపట్నం సమ్మిట్‌లో 30శాతం గ్రౌండ్ అయితే ఏపీ అద్భుతాలు సాధించినట్లేనని వివరించారు. ఈ పరిశ్రమలు అన్ని గ్రౌండ్ అయ్యేలా చూడాల్సిందేనని చంద్రబాబు ఆదేశించారని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో కూడా భారీగా ఎంవోయూలు జరిగాయని గుర్తుచేశారు. పెద్దఎత్తున వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లోనే కాకుండా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ఈ 18 నెలల్లో ఇచ్చామని మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. రూ.20,440 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని అన్నారు. 26 సంస్థలు తమ యూనిట్ల ఏర్పాటుకు అంగీకరించాయని వివరించారు. విశాఖ సమ్మిట్ ద్వారా 50వేల ఉద్యోగాలు వస్తాయని భావించామని అన్నారు. తమ ప్రభుత్వం ద్వారా ఎర్లీబర్డ్ ఇన్సెంటివ్‌లు కూడా ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. ఎంవోయూలు సరైన దిశలో అమలు చేయడానికి సీఎం, మంత్రివర్గ ఉపసంఘం, మంత్రులు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వీటన్నింటిని వరల్డ్ ఎకనామిక్ ఫోరంతో ప్రెజంట్ చేయడానికి కృషి చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. ఇన్నిపెట్టుబడులు రావడానికి కారణం తమ ప్రభుత్వానికి పెరిగిన క్రెడిబిలిటీనే కారణమని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు.

# గుర్తింపు కోసం నేను పనిచేయను..

మొదటి పేజీ తరువాయి



ప్రారంభించారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి సంస్కరణలో భాగంగా రాష్ట్రంలో 77 డీడీవో ఆఫీసులను ప్రారంభించాం అని, విస్తృతంగా ప్రజలకు సేవలందించడానికి డీడీవో ఆఫీసులు ఉపయోగపడుతాయన్నారు. సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించడానికి ఈ కార్యాలయాలు ఉపయోగపడతాయి పవన్ కళ్యాణ్ చెప్పారు. కూటమి ప్రభుత్వం కేంద్రానికి బలం అయ్యింది. కార్యకర్తలకు గుర్తింపు కష్టపడితే వస్తుంది. ప్రభుత్వ ఉద్యోగి ఇంటిలో పదోన్నతులపై ఎంతో ఆసక్తి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులనేది చాలా కీలకం. ఉద్యోగుల పాత్ర తెలుసు కాబట్టి పదివేల మంది ఉద్యోగులకు ఒకేసారి పదోన్నతులు కల్పించాం. గొంతు లేని వారికి మనం గొంతు అవ్వాలి, వారికోసం బలంగా నిలబడాలి. జీవితంలో రిస్క్ తీసుకుంటునే విజయం సాధించగలం. అది కూటమి ప్రభుత్వం చేసి చూపించింది. 15 సంవత్సరాల పాటు కూటమి ప్రభుత్వం అధికారికంలో ఉంటుంది. గత ఇరవై సంవత్సరాలలో కోట్లాది రూపాయల ఎర్రచందనం తరలించి సొమ్ము చేసుకున్నారు. 2008 నుండి రాజకీయాల్లో ఉన్నాను.. చంద్రబాబు లాంటి వారిని కుప్పం రాకుండా అడ్డుకున్నారు. ఎప్పుడూ కూడా ధైర్యాన్ని కోల్పోకుడదు.. ప్రజలు అన్నింటిని ధైర్యంగా ఎదుర్కోవాలి. కూర్చుని మాట్లాడుకుంటే అన్ని సమస్యలు తీరుతాయి. జనసేన కార్యకర్తలకు పరిపాలన పరంగా అనుభవం లేకపోవచ్చు కాని సమాజం కోసం కసిగా పనిచేస్తారు. పార్టీ పరంగా ప్రతి నియోజకవర్గంలో ఓ కమిటీ ఎర్పాటు చేస్తాం' అని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్ఠానికి ఐటీ వింగ్ ఏర్పాటు చేశాం'అని పవన్ అన్నారు. చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లా పర్యటన నిమిత్తం గురువారం ఉదయం 10.30 గం.లకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఏపీ ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ కు అధికారులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, రైల్వే కోడూరు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు,పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, అరవ శ్రీధర్, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ హరి ప్రసాద్, శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్యనాయుడు, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి, డ్వామా పిడి శ్రీనివాసరావు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, తదితర అధికారులు ప్రజాప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి వర్యులకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. విమానాశ్రయం వెలుపల ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి ఉదయం 10.40 గంటలకు రోడ్డు మార్గాన చిత్తూరు జిల్లాకు బయల్దేరి వెళ్ళారు.

# అమరావతి రెండో విడత ల్యాండ్ పూలింగ్

మొదటి పేజీ తరువాయి

చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. రెండో విడతలో అమరావతి మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన రైతుల నుంచి అధికారులు భూమిని సేకరించనున్నారు. ముందుగా యండ్రాయి గ్రామంలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను అధికారులు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా అమరావతి కోసం యండ్రాయి రైతు నంబూరి బలరాం 4 ఎకరాల భూమిని ఇచ్చారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమక్షంలో మంత్రి నారాయణకు పొలం పత్రాలను రైతు నంబూరి అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వం గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో రాజధాని నిర్మాణం ఆలస్యమైందని ఈ సందర్భంగా మంత్రి నారాయణ విమర్శించారు. గుత్తేదారులకు చెల్లించాల్సిన బకాయిలు ఇచ్చి మళ్లీ రాజధాని పనులు ప్రారంభించే సమయానికి వర్షాలు ముంచెత్తాయని తెలిపారు. అంతర్జాతీయ రాజధాని నిర్మాణంలో భాగంగా స్మార్ట్ ఇండస్ట్రీలు, ఇంటర్నేషనల్ విమానాశ్రయం, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని అన్నారు. రెండో విడతలో రైతులు ఇచ్చే 7000 పైగా ఎకరాల భూముల్లో 2500 ఎకరాలలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. గతంలో భూ సమీకరణ సమయంలో రాజధాని రైతుల విషయంలో అనుసరించిన విధానాన్నే ఇక్కడ కూడా అమలు చేస్తామని చెప్పారు. ట్రంకు రోడ్లు, ప్రధాన రహదారులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాలుగు, ఆరు లైన్ల రహదారి నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామని.. ఇక్కడ కూడా ఏడాది కాలంలోనే స్పోర్ట్స్ సిటీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. భూ సమీకరణపై రైతుల అభిప్రాయాలను మంత్రి నారాయణతో పాటు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలుసుకున్నారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.

# చంద్రబాబు పాలనలో రైతుల అధోగతి

మొదటి పేజీ తరువాయి



మాటే ఎత్తరు. ఈ 19 నెలల పాలనలో 17 సార్లు ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. రాష్ట్రంలో 84 లక్షల మంది రైతులు ఉంటే 19 లక్షల మందికి మాత్రమే పంటల బీమా ఉందని వైఎస్ జగన్ పేర్కొన్నారు. బాబు పాలనలో రైతుల జీవితాలు ఛిన్నాభిన్నమయ్యాయి. రూ.1100 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు ఉన్నాయి. మా హయాంలో హక్కుగా ఉచిత పంటల బీమా ఇచ్చాం. మా హయాంలో ఉచిత పంటల బీమా కింద రూ.7800 కోట్లు ఇచ్చాం. ఉచిత పంటల బీమాకు బాబు ఉరేశారు. బాబు పాలనలో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని జగన్ అన్నారు. ?. రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం గురించి చాలా విషయాలు తెలియాల్సి ఉందన్నారు. నాణెలినికి రెండో వైపు ఎలా ఉందో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం మొత్తం దేశం వైపు చూడాలని కోరారు. వైసిపి హయాంలో పండుగలా వ్యవసాయం ఉందని చెప్పారు. 62 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. చంద్రబాబు హయాంలో వ్యవసాయం దండుగగా మారిందన్నారు. మొంథా తుపానును చంద్రబాబు, లోకేష్, పవన్‌లే ఆపినట్లు బిల్డప్ ఇచ్చారని విమర్శించారు. తుపాను తర్వాత కూడా రైతులకు న్యాయం చేయలేదు అని చెప్పారు. నష్టపోయిన రైతులకు పైసా సాయం అందించలేదని, పైగా పంట నష్టాన్ని దారుణంగా తగ్గించారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌పై చంద్రబాబు ఎన్నికల ముందు ఏమన్నారు?.. ఇప్పుడు ఏం మాట్లాడుతున్నారంటూ వైఎస్ జగన్ నిలదీశారు. విశాఖలో ఉక్కుకు గనులు ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేశామని.. మా హయాంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఆపేశాం అని వైఎస్ జగన్ వివరించారు. ఉక్కు కార్మికులపై పీడీ యాక్ట్ పెట్టి లోపల వేస్తాడట..! అంటూ చంద్రబాబుపై వైఎస్ జగన్ మండిపడ్డారు. ఎస్ఏఐఎల్‌కు సొంత గనులున్నాయి. ఆర్ఐఎన్ఎల్‌కు సొంత గనులు లేవు. ఎస్ఏఐఎల్, ఆర్ఐఎన్ఎల్‌కు తేడా ఇదే. విశాఖ స్టీల్‌కు సొంత గనులు లేకే నష్టాలు. మిట్టల్‌కు సొంత గనులు ఇవ్వాలని బాబు అంటాడు. కానీ విశాఖ స్టీల్‌కు మాత్రం సొంత గనులు అడగరు. ప్రైవేట్‌కు గనులు అడుగుతారు కానీ.. ప్రభుత్వ ప్లాంట్‌ను పట్టించుకోరని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.సూపర్ సిక్స్ ఇచ్చేశామంటూ నిసిగ్గుగా చంద్రబాబు అబద్దాలు ఆడుతున్నారని జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. సూపర్-6,7 సూపర్‌హిట్ అని ప్రచారం చేసుకుంటున్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసింది గాడిదలను కాయడానికా? అంటూ మండిపడ్డారు. రైతులకు కూటమి ఇచ్చిన ప్రతిమాట అబద్ధమన్న వైఎస్ జగన్.. ఉచిత బస్సు ప్రయాణం కొంతమందికే, కొన్ని బస్సులు పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్-6,7 సూపర్‌హిట్ అని ప్రచారం చేసుకుంటున్నారు. చంద్రబాబు నుంచి గోబెల్స్ పాఠాలు నేర్చుకోవాలి. గోబెల్స్‌కు చంద్రబాబే టీచర్' అంటూ వైఎస్ జగన్ చురకలు అంటించారు. నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తామన్నారు. ఏమైంది?. రెండేళ్లలో ఒక్కొక్కరికి రూ. 72 వేలు ఇవ్వాలి ఏమైంది?. ఆడబిడ్డ నిధి కింద ప్రతినెలా రూ. 1500 ఇస్తామన్నారు. రెండేళ్లలో రూ.18 వేలు ఇవ్వాలి.. ఇచ్చారా?. బీసీలకు 50ఏళ్లకే పెన్షన్ అన్నారు.. ఇచ్చారా?. చంద్రబాబు ఈ-క్రాప్ వ్యవస్థను భ్రష్టుపట్టించారని అంటూ వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. ఏపీసీఎస్‌వోతో మేం ఒకటినే జీతాలు ఇచ్చేలా చేశామని.. చంద్రబాబు హయాంలో ఏపీసీవోఎస్‌ను నీరుగార్చారంటూ దుయ్యబట్టారు. ఏపీసీవోఎస్‌లో రెండు, మూడు నెలలకు కూడా జీతాలు లేవు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. కేవలం ఒక డీఏ మాత్రమే ఇచ్చారు. ఒక డీఏ కూడా వాయిదాల్లో ఇస్తారంట. రిటైర్డ్ అయ్యాక ఎరియర్స్ ఇస్తామన్నది బాబు ప్రభుత్వమే. ఎన్నికల్లో ఇచ్చిన పీఆర్సీ హామీ ఇప్పటికీ లేదని అంటూ వైఎస్ జగన్ మండిపడ్డారు. పీఆర్సీ ఛైర్మన్ కూడా లేదు. జీతాలు పెరగొద్దని పీఆర్సీ ఛైర్మన్‌ను నియమించలేదు. పీఆర్సీ లేదు.. ఐఆర్ లేదు. ప్రభుత్వ ఉద్యోగులకు రూ.31 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు.

# రైతులను నట్టేట ముంచిన ఘనత జగన్‌ది

మొదటి పేజీ తరువాయి

సమస్యలు తెలిసేదని అన్నారు. గెస్ట్‌లాగా వచ్చి విమర్శలు చేయడం కాదని జగన్‌కు చురకలు అంటించారు. వైఎస్ జగన్ చేస్తున్న నీచ ఆరోపణల గురించి రాష్ట్ర ప్రజలకు పూర్తిగా అవగాహన ఉందని మంత్రి స్పష్టం చేశారు. కేవలం 18 నెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, జగన్ ఐదేళ్ల పాలనలో చేసిన అబద్ధాలను బట్టబయలు చేసిందని అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వని జగన్ మాట్లాడే అర్హతే లేదని మంత్రి తేల్చిచెప్పారు. గత ప్రభుత్వంలో 1,674 కోట్లు ధాన్యం బకాయిలు చెల్లించకుండా వదిలిపెట్టగా, కూటమి ప్రభుత్వం ఆ మొత్తాన్ని వెంటనే చెల్లించిందని పేర్కొన్నారు. రైతు ఆత్మహత్యల కుటుంబాలకు గత ప్రభుత్వం ఇవ్వని పరిహారాలను కూడా కూటమి ప్రభుత్వం తక్షణమే అందజేసిందని అచ్చెన్నాయుడు తెలిపారు. మద్దతు ధరల కోసం రైతుల సంక్షేమార్థం 16 నెలల్లోనే 800 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని ఆయన వివరించారు. వాస్తవాలపై బహిరంగ చర్చకు వైఎస్ జగన్ సిద్ధమైతే తాను ఎప్పుడైనా సిద్ధమేనని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు.. కానీ జగన్ ఇలాంటి చర్చలకు రాడని, కేవలం రాయి వెళ్లడం అలవాటు చేసుకున్నాడని మండిపడ్డారు.

# జగన్ ఏనాడైనా సమస్యలు పట్టించుకున్నారా?

## ఏపీలో ఎన్నిరోజులు ఉంటున్నారో చెప్పగలరా

## హోంమంత్రి అనిత ఘాటు విమర్శలు

**విజయనగరం :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదవి పోయిన తర్వాత ఏపీలో జగన్ ఎన్ని రోజులు ఉన్నారో చెప్పాలని అన్నారు. ఆయన తమ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని సవాల్ విసిరారు. గురువారం విజయనగరంలో హోంమంత్రి అనిత పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో హోంమంత్రి అనిత మాట్లాడారు. జగన్ హయాంలో ప్రజా సమస్యలను పరిష్కరించకుండా గాలికొదిలేశారని మండిపడ్డారు. ధాన్యం అమ్మిన రైతులకు 24 గంటల్లోగా డబ్బులు జమ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పుకొచ్చారు. టిడ్కో ఇళ్లు పేదలకు అందకుండా చేసిన పాపం జగన్‌దని.. లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదని తెలిపారు. ఆయుధాలు విడిచిపెట్టి మావోయిస్టులను లొంగిపోవాలని కోరుతున్నామని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకోలేమని... ఆపదలో ఉన్న వారిని సకాలంలో ఆదుకుంటామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శనీయం.

● జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, డిసెంబర్ 4 : ( సమయం న్యూస్ ):** మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లో నిర్వహించిన కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి పాల్గొన్నారు. కొణిజెటి రోశయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక, రవాణ, గృహ నిర్మాణం, వాణిజ్య పన్నుల, విద్య, వైద్య శాఖ మంత్రిగా సేవలు అందించారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొంత కాలం సేవలు అందించారని, అలాగే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్ గా పనిచేసారని తెలిపారు. మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శనీయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి, జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, తహసిల్దార్ లు, ఎఫ్ఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పని చేసిన బీజేపీ నాయకులు నాయిని సందీప్ కుమార్



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 4 :** ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు లేకపోతే ప్రజల ఆరోగ్యం కుంటుపడుతుందన్నారు.మన ఆరోగ్యానికి మన ఆనందానికి వీధులు శుభ్రంగా ఉండటమే ముఖ్య కారణమని, దీనికి ఎనలేని సేవ చేస్తున్నటువంటి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికుల యొక్క కృషి ఎంత చెప్పినా తక్కువే అని అన్నారు. 12వ వార్డులో యాదగిరి, సైదమ్మ వీరిద్దరూ అందరితో కలుపుగోలుగా ఉంటూ ఎక్కడా చెత్త పేరుకపోకుండా నిత్యం వీధులను పరిశుభ్రంగా ఉంచుతూ ఉంటారు, పరిసరాలు శుభ్రంగా ఉంటే సగం రోగాలు దరిచేరువు అనే విషయం మన అందరికీ తెలిసిందే అని అన్నారు. ఈ నేపథ్యంలో వారితోపాటు కాసేపు మోరీలు శుభ్రపరుస్తూ గడ్డిని చెక్కిన నాయిని సందీప్ గారు పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని అన్నారు.

# దాతర్ పల్లి అభివృద్ధి నా లక్ష్యం బారు నాగలక్ష్మి



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 4 :** గజ్వేల్ నియోజకవర్గనికి చెందిన దాతర్ పల్లి గ్రామంలో బారు నాగలక్ష్మి బిజెపి అభ్యర్థిగా 8వ వార్డులో వార్డ్ మెంబర్ బరిలో ఉన్నానని గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బారు నాగలక్ష్మి మాట్లాడుతూ వార్డ్ ప్రజలే నాకు శ్రీరామ రక్ష అని, నా గ్రామ ప్రజల కోసం నిరంతరం కష్టపడుతూ ప్రజల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటానని, ఆపదలో అండగా ఉంటానని అన్నారు. వార్డ్ ప్రజల్లో నేను మీలో ఒక్కరిగా ఉండి బాధ్యతగా పనిచేస్తామన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిజాయితీగా పనిచేసే అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్న నిండు మనసుతో ఆదరించి నన్ను ఆశీర్వదించి మీ అమూల్యమైన ఓటు వేసి నన్ను గెలిపించగలరాని కోరారు.

# స్నేహితుడి తల్లి కోసం మిత్రుల స్నేహస్తం



**బాన్సువాడ, డిసెంబర్ 4 (సమయం న్యూస్) :** బాన్సువాడ మండలం తిరుమలపూర్ గ్రామంలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో స్నేహబంధం అండగా నిలుస్తోంది. సాధారణ మహిళా రిజరేషన్ వచ్చిన ఈ గ్రామంలో, గత 30 ఏళ్లుగా పోచారం శ్రీనివాస్ రెడ్డి విధేయుడిగా సేవలు అందిస్తున్న మ్యాడ మల్లారెడ్డి తన తల్లి మ్యాడ అనసూయను సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ప్రోత్సాహంతో పోటీలోకి దిగారు.ఆ విషయాన్ని తెలుసుకున్న మల్లారెడ్డి చిన్ననాటి స్నేహితులు ముందుకొచ్చి తమకు తోచిన ఆర్థిక సహకారాన్ని అందించారు. గురువారం రోజు ఆమె నామినేషన్ ఫీజును స్నేహితులు స్వయంగా అందజేశారు. తదుపరి ప్రచార కార్యక్రమాలకు కావలసిన సామగ్రి సేకరణలో కూడా పాల్గొంటామని నరేష్, శ్రీకాంత్, శ్రీను, అరుణ్, మనోజ్, వెంకట్రావ్ తెలిపారు. ప్రజల మధ్య ప్రచారం, ఇంటింటి సమాచార కార్యక్రమాల్లో సైతం చురుకుగా పాల్గొంటామని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా పనిచేసే నాయకత్వం అవసరమని, అనుభవంతో పాటు నిబద్ధత కలిగిన అభ్యర్థిని ప్రజలు ఆశిస్తున్నారని స్నేహితులు అభిప్రాయపడ్డారు. తిరుమలపూర్ గ్రామ పురోగతికి అనసూయ విజయం దోహదం చేస్తుందని విశ్వాసం వ్యక్తమైంది.

# మోడీ ఆర్థిక విధానాల వల్ల పతనమైన రూపాయి విలువ గరిష్టంగా డాలర్ 90

- ప్రమాదకరంగా100 కు చెరువలో
- ఆర్థిక సంక్షోభంలోపేదలు మధ్యతరగతి వర్గం
- ప్రముఖ విద్యావేత్త, న్యాయ నిపుణులు మహమ్మద్ అసద్



**ఖమ్మం , డిసెంబర్ 4 : ( సమయం న్యూస్ ) :** సుమారు 12 సంవత్సరాల మోడీ ఆర్థిక విధానాల ఫలితం గాఘోరంగారూపాయి విలువ పతనమైందని , గరిష్టంగా డాలర్ 90కుదిగజారిందని , ప్రమాదకరంగా ఈ విలువ 100 కుచెరువవలో ఉందని , దీని ఫలితంగా దేశంలోని పేద , మధ్యతరగతి వర్గం ఆర్థిక సంక్షోభంలో కురుక్కొని పోనుందని ప్రముఖ విద్యావేత్త , న్యాయ నిపుణులు మహమ్మద్ అసద్ ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశ మొట్టమొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ కాలంలోరూపాయల 30 పైసలు కు డాలర్ విలువ ఉండగా దివంగతప్రధానమంత్రి ఇందిరాగాంధీ హయాంలో ఈ విలువ పది రూపాయలకు చేరుకుందని , డాక్టర్ మన్మోహన్ సింగ్ నాటికి ఈ విలువ 42 కు వచ్చిందని మహమ్మద్ అసద్ పేర్కొన్నారు. సుమారు 60 ఏళ్లలో అంతగా పెరగనిడాలర్ విలువప్రస్తుత 12 ఏళ్లలో పెరిగిందని తెలిపారు. ప్రధాని మోదీ2014 ఎన్నికల ప్రణాళికలో పతన మవుతున్న రూపాయి విలువలపై మన్మోహన్ సింగ్ ను తీవ్రంగా దుయ్యబట్టిన విషయాన్ని గుర్తు చేస్తూతాను అధికారంలో రావడంతోనే ఆర్థిక వ్యవస్థను ఒక గాడిలో పెట్టి రూపాయిపతనం కాకుండా అందరికీ అందుబాటులో తీసుకొస్తానని ప్రజలను నమ్మించి , మోడీమోసం చేశారని ఆరోపించారు. మోడీ విధానాలు దేశానికి , దేశ ప్రజల హితానికి అత్యంత వినాశానికిదారి తీయడం జరిగిందని , ఈ విధానాల ప్రభావాలు అత్యంత ప్రమాదకరంగా , ఆందోళన భరితంగా తయారయ్యాయనిమహమ్మద్ అసద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఆర్థిక విధానాల ఫలితంగా చమురు , పెట్రోల్ , డీజీలు ధరల పెరుగుదలకు దారి తీసి , పేద , మధ్యతరగతి వర్గాలపై తేరుకోలేని విధంగా ఆర్థిక దెబ్బ పడుతుందన్నారు. ఫలితంగా నిత్యావసర వస్తువులు కూరగాయలను సామాన్య మానవుడు కొనుక్కోలేని విధంగా స్తితి గతులు మార్పు చెందుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎగుమతులు తగ్గడంతో పాటుదిగుమతులు పెరుగుతాయని చెప్పారు. మేకింగ్ ఇండియా అనడమే గాని దానికి అనుకూలమైన కార్యచరణ ప్రణాళిక లేదని విమర్శించారు. ఒక మొబైల్ వస్తువులను దిగుమతి చేసుకొని , ఇక్కడ తయారు చేసే ప్రక్రియ కు మేకింగ్ ఇండియా అనడం లోఅర్థమే లేదన్నారు. ప్రస్తుతం 150 రూపాయలకు జరుగుతున్న ఒక నూనె ప్యాకెట్ రేపటికి 200 రూపాయల మేరకు పెరుగుతుందన్నారు. ఎగుమతులు తగ్గటం దిగుమతులు పెరగడం , పెట్రోల్ డీజిల్ ధరల తో పాటు రవాణా వ్యవస్థ అధిక భారము పడటం కారణంగా 15% నుండి 25% వరకు ధరలు పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. నిన్న మొన్నటి వరకు రష్యా నుండి తక్కువ ధరకు ముడి చమురును అమెరికాతో పోలిస్తే 30 శాతం తక్కువ ధరకు కొనుగోలు చేసే పరిస్థితి నుండి మరోసారి అమెరికా హెచ్చరికల నేపథ్యంలో రష్యా నుండి ముడి చమురు కొనడం మానివేసి , 30% అధిక ధరలకు అమెరికా నుండి కొనుగోలు చేయడం ప్రారంభించడం మనకు మనమే వెళ్లే , వద్య శిలపై పడుకున్నట్లు అయిందన్నారు. దేశానికి స్వాతంత్రరాకముందే మన దేశానికి సంబంధించి మహాత్మా గాంధీ ఆర్థిక వ్యవస్థ గురించి గొప్ప ఆలోచనలు చేసిన విషయాన్ని మొహమ్మద్ అసద్ ప్రస్తావిస్తూ .... కుటీర , చిన్న తరహా పరిశ్రమలకు తగినప్రాధాన్యత కల్పిస్తే మన ఆర్థిక వ్యవస్థ ఒక గాడి లోఉంటుందని , ఇప్పుడు ఈ విషయం లో గల ఆయన దూర దృష్టిని అందరు గుర్తిస్తున్నారన్నారు. దేశం కి స్వాతంత్రం రాకముందే జాతిపిత మహాత్మా గాంధీదేశ ప్రగతికి కుటీర చిన్న తరహా పరిశ్రమలు ప్రగతికి సోపానాలని చెప్పిన దానిని స్వాతంత్రం అనంతరం పాలించినమన పాలకులు దీనిని పాటించి , అధిక ఆర్థిక వ్యవస్థ తో పాటుపారిశ్రామిక అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి , దేశం బలోపేతంకు తగిన చర్యలు తీసుకున్నారని తెలిపారు.ప్రస్తుత ఈ వినియోగ ఆర్థిక వ్యవస్థ భారం దేశంలోని 35 నుండి 40 కోట్ల వరకు గలమధ్య తరగతి కొనుగోలు శక్తిని తీవ్రంగాక్షీణించి వేస్తుందనితెలిపారు. రానున్న తరుణంలో ఈ వర్గం శాశ్వతంగా ఆర్థిక సంక్షోభంలో పడిపోయి , ఆహారం లభించని స్థితి కీ దిగజారి పోతుందన్నారు. గాంధీ విధానాలు అమలు చేయక పోవడం, ఆర్థిక వ్యవస్థ ను ప్రతిష్టతను బలోపేతం చేయక పోవడం, ప్రభుత్వ సంస్థల కు బదులు ప్రైవేటు రంగానికి ఊతం ఇవ్వడం... మోదీవైప్యాలని తప్పు బట్టారు. కార్పొరేట్ శక్తులు బలహీన పడ్డప్పటికీ వాటికి అధిక రుణాలు కల్పించి, దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నం కావడానికి మోడీ కారణం అయ్యారని దుయ్యబట్టారు. ఇదే సమయంలో మోడీ మతోన్మాద భావనలను విడనాడి , ఆర్థికపరిస్థితులను త్వరితగతంగా చక్క దిద్దని పక్షంలో వేగంగా ఆ సమాన తలు ప్రబలి , ఒకరిని ఒకరు దోచుకునే ప్రమాదం ఉందని మహమ్మద్ ఆసద్ హెచ్చరించారు.ఇప్పటికైనా జాతీపితమహాత్మా గాంధీ సూచించిన సలహాలు పాటిస్తే , మన ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతోపాటుసరైన గాడిలో పడుతుందని మహమ్మద్ అసద్ ప్రకటించారు.

# భద్రాచలం లో బిజెపి టిడిపి జనసేన బలపర్చిన అభ్యర్థిగా బాణావత్ హరిచంద్ర నాయక్

- తనను గెలిపిస్తే అభివృద్ధి బాటలు వేస్తా అంటూ
- ప్రజలకు హామీలు
- తన మేనిఫెస్టో తో విస్తృత ప్రచారం
- ( సమయం ఇంటర్వ్యూలో ...)



**ఖమ్మం , డిసెంబర్ 4 : ( సమయం న్యూస్ ) :** పంచాయితీ ఎన్నికల పోరుకు భద్రాచలం లో బిజెపి టిడిపి జనసేన బలపర్చిన అభ్యర్థిగా బాణావత్ హరిచంద్ర నాయక్ తన ప్రత్యర్థులకు దీటుగా ముందుకు సాగుతున్నారు. తనను గెలిపిస్తే భద్రాచలం అభివృద్ధికి బాటలు వేస్తానని అంటూ ప్రజలకు హామీలు గుప్పిస్తూ , భద్రాచలం సమగ్ర అభివృద్ధికి తయారుచేసిన తనదైన మేనిఫెస్టో తో విస్తృత ప్రచారాన్ని తలపెట్టారు. భద్రాచలం గ్రామపంచాయతీ ఎన్నికల గోదాలో నిలబడ్డ బిజెపి టిడిపి జనసేన అభ్యర్థి విద్యావంతుడిగా, వ్యాపారవేత్తగా, దూరదృష్టి కలిగిన నేతగా బాణావత్హరిచంద్ర నాయక్ భద్రాచలంలో పేరుగాంచారు. హరిచంద్ర నాయక్ వంటి బలమైన అభ్యర్థి సర్పంచ్ గా విజయం సాధించటం తద్యమని బిజెపితో పాటు, టిడిపి, జనసేన పార్టీలు భావించి ,మేజర్ గ్రామపంచాయతీ భద్రాచలం సర్పంచ్ అభ్యర్థిగా బాణావత్ హరిచంద్ర నాయక్ మద్దతు పలికారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సమయం ప్రతినిధి యం డి . షఫీయు జమ కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో భద్రాచలం ను గత పాలకులు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేదని, మౌలిక సదుపాయల కల్పనలో భద్రాచలం ప్రాంతం వెనుక పడిపోయిందని బాణావత్ హరిచంద్ర నాయక్ విమర్శించారు. తాను ఏ పార్టీకి చెందనని , తాను కేవలం భద్రాచలం సమగ్ర అభివృద్ధి కాంక్షిస్తూ ఎన్నికల బరి లో దిగినట్లు ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. తాను మొదటి సారిగా ఈ పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నప్పటికీ తన ప్రత్యార్థులకు దీటుగా ఒక ప్రణాళికతో, తనదైనమేని ఫెస్ట్ తో ముందుకు పోతున్నారు. గత పాలకులు భద్రాచలం అభివృద్ధి పట్ల నిర్లక్ష్య వైఖరి ఆలంబించారని, భద్రాచలం సమగ్ర అభివృద్ధికి తాను కృషి చేస్తానని, అందుకోసమే తాను భద్రాచలం పంచాయితీ సర్పంచ్ అభ్యర్థిగా పోటికి దిగానని తెలిపారు. నిజంగానే అభివృద్ధి చేసి ఉంటే భద్రా చలం ఇలా ఉండేది కాదన్నారు. అభివృద్ధి అర కొర మాత్రమే అని పేర్కొన్నారు. కాంట్రాక్టల జేబులు నింపే అభివృధి పనులే జరిగాయన్నారు. తాను కెమికల్ ఇంజనీర్ చదివిన ఉన్నత విద్య వేత్త తో పాటూ వ్యాపార వేత్త గా ఉన్నపటికీ కేవలం భద్రాచలం అభివృద్ధి చింతా తనను రాజకీయాల అతీతంగా, నిస్వార్థ ఆలోచనతో పోటీ చేస్తున్నానని అన్నారు. ముందునుండి కూడా తనకు సామాజిక సేవా కార్యక్రమాలు అంటే ఇష్ట మని, తాను లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్, జోన్ చైర్మన్ గా ఉన్నపుడు సుమారు 100 మంది పేదలకు 5 సెంట్ల స్థలం కేటాయించి, మోడల్ ఇళ్లు కట్టించడం జరిగిందన్నారు.ఇదే తరహాలో భద్రాచలం అభివృద్ధికి గాను రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం, పారిశుధ్య పనులు, కరకట్టల రహదారి నిర్మాణాలను పటిష్టవంతంగా రూపొందిస్తానని అన్నారు. టెంపుల్ సిటీగా పేరుగాంచిని భద్రాచలం ఇప్పటివరకు సమగ్ర అభివృద్ధి చెందకపోవడం విచారకరమని, ఈ అంశమే తనను ఎలాంటి రాజకీయాలతో సంబంధం లేకున్నప్పటికీ పంచాయతీ పోరులు సర్పంచ్ గా పోటీ చేసేందుకు ముందుకు నడిపించిందని అన్నారు. తన కుటుంబ సభ్యులు, తన బంధువులంతా కూడ ఉన్నత ఉద్యోగాలు, పెద్ద ఎత్తున వ్యాపారాలు నిర్వహిస్తున్నారని , ఎవరికి కూడా రాజకీయాల పట్ల ఆసక్తి లేదని ... కాగా తన బాధ , తన ఆవేదన భద్రాద్రి సమగ్ర అభివృద్ధి అనగానే అందరూ ఉత్సాహంగా తనకు మద్దతు పలుకుతున్నారని ప్రకటిస్తూ.. తాను ఎలాంటి వాడో లయన్స్ క్లబ్ గవర్నర్ గా తాను అందించిన సేవలే ఉదాహారణలుగా నిలుస్తాయని అన్నారు. ప్రత్యర్థులు ఎవరైనప్పటికీ తన విజయ అవకాశాలను నిరోదించలేరని , తన గెలుపు ఖాయమని బాణావత్ హరిచంద్ర నాయక్ తెలిపారు. భద్రాచలంకు సంబంధించి ప్రత్యేకంగా తాను ఒక మెనిఫెస్టోను తయారు చేశానని దాని ఆదారంగా తన ప్రచారం విస్తృత స్థాయిలో ఉంటుందని దీమా వ్యక్తం చేశారు. భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఎన్నికైన అనంతరం మరోసారి మాట్లాడదామని బాణావత్ హరిచంద్ర నాయక్ ఇంటర్వ్యూ ముగించారు.

# ఖమ్మంలో రెండు గంజాయి కేసుల్లో శిక్షలు



**ఖమ్మం , డిసెంబర్ 4 : ( సమయం న్యూస్ ) :** ఖమ్మం జిల్లా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవిహెరెండు కేసుల్లో గంజాయి నిందితులకు 20 , 10 సంవత్సరాల పాటు జైలు శిక్షలతోపాటు రూ. లక్ష చొప్పున జరిమానా విధిస్తూహెజ్ గురువారం వెలువరించారు. వివరాల్లోకి వెళితే..గంజాయి నిందితుడికి 20 సంవత్సరాల శిక్ష ఖమ్మం పట్టణం వరంగల్ క్రాస్ రోడ్డులో రాజస్థాన్కు చెందిననిందితుడు 22.150 కేజీల గంజాయిని 2024 జనవరి 9నతరలిస్తున్న క్రమంలో డీటీఎఫ్ విజేందర్ టీమ్ పట్టుకున్నారు. ఖమ్మం పట్టణ ఎక్సైజ్ స్టేషన్లో ఎస్సై సందీప్రావు కేసు నమోదుశారు. ఈ కేసులో ఎక్సైజ్ అధికారి వేణుగోపాల్రెడ్డి, చంద్రమోహన్,రితలు పూర్తి స్థాయిలో విచారణ జరిపి చార్జీషట్ వేశారు.ఈ కేసులో ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవినిందితుడికి 20 సంవత్సరాలు జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ తీర్పుహెహెవెలువరించారు. నిందితుడు రాజస్థాన్కు చెందిన బాగ్ చంద్ బ్కెర్వా(31) అనే వ్యక్తికి ఈ శిక్ష విధించారు. మరో కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు శిక్ష..ఖమ్మం పట్టణం కొత్త బస్టాండ్ సమీపంలో బైక్పై 7 కేజీలగంజాయిని సూర్యపేట్కు తరలిస్తున్న నలుగురిని 2022ఏప్రిల్ 10న వేణుగోపాల్, సీఐ రాజు పట్టుకున్నారు.ఈ కేసులో కానుకుర్తి సాయి నవీన్, నేరేళ్ల శ్రీరాములు అనే ఇద్దరికి గురువారం ఖమ్మం ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి పది సంవత్సరాల జైలు శిక్షహె లక్ష జరిమానా విధించారు.ఈ కేసులో మారుశ్వర్రావు, బట్టు హరీష్లు నేటికి పరారీలో ఉన్నారు.రెండు కేసుల్లో 20,10 సంవత్సరాల పాటు శిక్షలు పడడం పట్ల ఖమ్మం డిప్యూటి కమిషనర్ జనార్ధన్రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కేసుతోసంబంధించిన సిబ్బందిని అభినందించారు.

# అయ్యప్ప పడిపూజతో మార్మోగినా తాండూర్





- ఘనంగా పట్నం రినిష్ రెడ్డి అయ్యప్ప స్వామి మహా పడిపూజ

**తాండూరు మున్సిపల్ (మం)డిసెంబర్ 4,(సమయం న్యూస్)** స్వామియే శరణం అయ్యప్పా... స్వామి శరణం..అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో వికారాబాద్ జిల్లా తాండూర్ మార్మోగింది. శాసనమండలిలో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ పట్నం సునీత రెడ్డి ల కుమారుడు పట్నం రినీష్ రెడ్డి నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం అద్యంతం భక్తిశ్రద్ధలతో సాగింది. తాండూర్ లోని శ్రీశ్రీశ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో సాగిన మహా పడిపూజ లో నియోజకవర్గంలోని తాండూర్, పెద్దేముల్, యాలాల్, బషీరాబాద్ తో పాటు పక్కనే ఉన్న కొడంగల్, వికారాబాద్ నియోజకవర్గాలకు చెందిన అయ్యప్ప భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి, సునీతమ్మ దంపతులతో పాటు అన్నదాత రినీష్ రెడ్డి అయ్యప్ప స్వామికి అభిషేకాలు నిర్వహించి హారతులు ఇచ్చారు. అయ్యప్ప మాలాలంకరణ లో ఉన్న స్వాములు, భజన మండలి భక్తులు పాటలు, భజనలతో అయ్యప్పను కీర్తించారు. పల్లకి సేవ నిర్వహించారు.అయ్యప్ప భక్తులకు తాంబూలాలు అందించారు. పట్నం మహేందర్ రెడ్డి, సునీతమ్మ దంపతులకు లతోపాటు పటం రినీస్ రెడ్డి లు అయ్యప్ప భక్తులకు స్వయంగా భిక్షను వడ్డించారు.పిసిసి ప్రచార కమిటీ సమన్వయకర్త కరణం పురుషోత్తం రావు,వికారాబాద్ డిసిసి అధ్యక్షుడు ధారాసింగ్, మాజీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రాజు గౌడ్, మాజీ జడ్పిటిసిలు మల్కూడ్ రాకేష్ ముదిరాజ్, రవి గౌడ్ , సిద్రాల శ్రీనివాస్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వడ్డే శీను, శ్రీనివాస్ రెడ్డి, కోయిర్ శ్రీనివాస్ యాదవ్, జీవన్గి మాణిక్ రెడ్డి, డిసిసి బి మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, చేవెళ్ల సీనియర్ నేత పల్గుట్ట జనార్ధన్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్లు విశ్వనాథ్ గౌడ్, స్వప్న పరిమళ్, కౌన్సిలర్లు శోభారాణి, పరిమళ, అనురాధ, పుల్ల నర్మదా దేవి,సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, శ్రీనివాసచారి, బసిరెడ్డి, పగిడాల మల్లారెడ్డి, శివకుమార్, బషీరాబాద్ సహకార సంఘం చైర్మన్ వెంకటరామిరెడ్డి, గడ్డిల రవీందర్, భగవాన్, బిర్కిట్ రఘు, సిద్దు, రహిల్ మిర్జా, పొన్నాల సాయిరెడ్డి, అశోక్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీసులకు ప్రత్యేక శిక్షణ

- డీఎస్పీ లు నల్లపు లింగయ్య,మహేష్.
- నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు









**కోస్గి,మున్సిపల్(మం)డిసెంబర్,04,(సమయం న్యూస్) :** కోస్గి: నారాయణపేట జిల్లా పరిధిలో జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహించేందుకు విధులు నిర్వర్తించే పోలీసులకు కోస్గి లోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి డీఎస్పీ నల్లపు లింగయ్య, డీఎస్పీ మహేష్ లు మార్గదర్శకులుగా హాజరై, పోలీసు సిబ్బందికి ఎన్నికల సమయంలో తప్పనిసరిగా పాటించాల్సిన చట్టపరమైన నిబంధనలు, ఎన్నికల కమీషన్ ఆదేశాలు, మరియు ప్రవర్తనా నియమావళి ) పై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూఎన్నికల విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉంటూ, రాజకీయ పార్టీలతో పక్షపాతం లేని విధంగా, చట్టపరంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పోలింగ్ సెంటర్ల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, అక్రమంగా డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ, ఓటర్లకు బెదిరింపులు వంటి సంఘటనలు గమనిస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లకు పూర్తి రక్షణ, భద్రత సహకారం అందిస్తూ శాంతి భద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. ఏవైనా రాజకీయ పార్టీల ఒత్తిళ్లకు లోనుకాకుండా, ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి అని స్పష్టం చేశారు. ఓటు ప్రదేశాల్లో 163 (144 )సెక్షన్, డ్రై డే, ప్రత్యేక నిబంధనలు, మహిళా భద్రత వంటి అంశాలపై వివ రించారు. సీసీ కెమెరాలు ద్వారా నిఘా ఉంచాలని, ఎలా ంటి గొడవలు జరిగే ఆస్కారం ఉన్న గొడవలు జరుగు తున్న వెంటనే పై అధికారులకు నివేదించాలని సూచించారు.

**పోలీసులు పాటించాల్సిన ముఖ్య నిబంధనలు**

చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనించిన వెంటనే కేసులు నమోదు చేయాలని.పోలింగ్ స్టేషన్ల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ప్రచార నిషేధం, గుంపులు గుంపులుగా ఉండకుండా చూడాలని తెలిపారు.ఓటర్లపై ఒత్తిడి, ప్రలోభాలకు అవకాశమివ్వకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని అన్నారు.ఎటువంటి వివాదాలు తలెత్తినా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.విధుల్లో తగిన శ్రద్ధ, క్రమశిక్షణ, సమయపాలన, యూనిఫామ్ నిట్ టర్నవట్ ధరించాలని తెలిపారు.శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో కోస్గీ సీఐ సైదులు, కోస్గి ఎస్సై బాలరాజు , మద్దూరు ఎస్సై విజయ్ కుమార్,ఎస్సై ఆంజనేయులు, సర్కిల్ పరిధిలోని పోలీసు కానిస్టేబుళ్లు,హెూంగార్డులు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ల జారీ,వినియోగంపై శిక్షణ

**మహబూబ్ నగర్ డిసెంబర్4( సమయం న్యూస్). :** మహబూబ్‌నగర్ జిల్లా లో గ్రామపంచాయతీ ఎన్నికల మొదటి దశ ఈ నెల 11 న నిర్వహించనున్న నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ల జారీ,పంపిణీ ప్రక్రియలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులు జోనల్ అధికారులతో ప్రత్యక్షంగా, వెబెక్స్ ద్వారా విస్తృత శిక్షణ నిర్వహించారు.శిక్షణ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి దశ గ్రామపంచాయతీ ఎన్నికలు ఈ నెల 11న గండీడ్, నవాబ్‌పేట్, రాజాపూర్, మోహమ్మదాబాద్, మహబూబ్‌నగర్ మండలాల్లో జరగనున్నాయని గుర్తుచేశారు. ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న పొరపాటు కూడా తీవ్రమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున, పోస్టల్ బ్యాలెట్‌ల పంపిణీని అత్యంత శ్రద్ధతో, పారదర్శకంగా నిర్వహించాలని ఆమె తెలిపారు. రక్షణ దళాల్లో పనిచేస్తున్న సర్వీస్ ఓటర్ల పోస్టల్ బ్యాలెట్లు గురువారం సాయంత్రంలోపు తప్పనిసరిగా పంపాలంటూ ఆమె స్పష్టం చేశారు. అయితే, సర్వీస్ ఓటర్ల జాబితాను ముందుగా సంపాదించి, గ్రామపంచాయతీ వారీగా, వార్డు వారీగా వర్గీకరించాలని నోడల్ అధికారులకు కలెక్టర్ సూచించారు. వారి ప్రస్తుత పని స్థలం చిరునామాలను సేకరించి సంబంధిత స్టేజ్-1 కి పంపాలని ఆదేశించారు. ఎన్నికల డ్యూటీలో ఉన్న ఉద్యోగులు మరియు ప్రివెంటివ్ డిటెన్షన్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్లు జారీ చేయాలంటే -14 ద్వారా ముందస్తు నమోదు తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ -14 సమర్పించిన వారికే పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వాలని అధికారులకు ఆమె సూచించారు.ఎన్నికల డ్యూటీలో ఉన్న ఉద్యోగులు సులభంగా ఓటు వేయడానికి ప్రతి మండలంలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఉప తహసీల్దార్లకు కలెక్టర్ ఆదేశించారు.పోస్టల్ బ్యాలెట్‌ల జారీ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తగా పనిచేయాలని, ఏమైనా సందేహాలు ఉంటే ఎన్నికల హ్యాండ్‌బుక్‌ను పూర్తిగా చదివి అనుసరించాలని కలెక్టర్ మరోసారి సూచించారు. ప్రత్యక్షంగా ఓటు వేయలేని వారి ఓటు హక్కును రక్షించే ఈ కీలక ప్రక్రియను ఎటువంటి పొరపాట్లు చేయకుండా నిర్వహించడం ప్రతి అధికారికి బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు.అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి. హార్టికల్చర్ డి.డి వేణుగోపాల్, మాస్టర్ ట్రైన శ్రీకాంత్, బి1 , రిటర్నింగ్ అధికారులు, ఇతర ఎలక్షన్ అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం తోనే సాధ్యం.

- సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్.



**రాయపోల్, ,డిసెంబర్ 4:** గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం తోటే సాధ్యమవుతుందని బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ అన్నారు. గురువారం మండలంలోని పెద్ద ఆరేపల్లి గ్రామ సర్పంచ్ కర్రోళ్ళ దివ్య కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నిక అవ్వడంతో ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ కర్రోళ్ల దివ్య కృష్ణ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అలాగే ఉపసర్పంచ్ విరేశ్ ను వార్డు సభ్యులు నర్సింలు,మమత, నర్సింలు, మంజుల,కల్పన,మంజుల ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామస్తులందరికీ బిజెపి తరఫున ధన్య వాదాలు తెలిపారు. మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్ రావు,బిజెపి సహకారం తో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం తోటే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గత 11 సంవత్సరాల కాలంలో గ్రామంలో నిర్మించిన స్మశానవాటికలు, డంపింగ్ షెడ్ గాని గ్రామంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమంలోనైనా కేంద్రం ఇచ్చిన నిధులతోనే సాధ్యమవుతుందన్నారు. గత రెండు సంవత్సరాల కాలంలో సర్పంచ్లు లేకున్నా కేంద్ర ప్రభుత్వం నిధులతోటే గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.3000 కోట్ల నిధుల కోసమే ఎన్నికలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు మంకిడి స్వామి, మాజీ అధ్యక్షులు వెంకట్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నీల స్వామి, నాయకులు టెన్కంపేట నర్సింలు,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడ నియోజక వర్గం మొదటి విడత లో ఏకగ్రీవాలు.

**బాన్సువాడ డిసెంబర్4(సమయం న్యూస్) :** బాన్సువాడ నియోజకవర్గంలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఏకగ్రీవ ఫలితాలకు సహకరించిన గ్రామాల ప్రజలకు, ఆయా మండలాల నాయకులకు, గ్రామ నాయకులకు, పార్టీ కార్యకర్తలకు నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అధిష్టానం సూచనలతో రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, నాయకులు పోచారం సురేందర్ రెడ్డి ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయాలు సాధించారు.నియోజకవర్గంలోని వర్ని, కోటగిరి, పోతంగల్, చందూర్ మండలాల్లో మొత్తం 16 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. వర్ని మండల పరిధిలో రూప్లానాయక్ తండా నుంచి సిరినా బలరాం, మల్లారం నుంచి లక్ష్మణ్ ముదిరాజ్, వకీల్ ఫారం నుంచి మద్దిపూడి శ్రీనివాస్, శంకోరా నుంచి హరిసింగ్, రాజ్‌పేట నుంచి కవిత, సిద్ధాపూర్ నుంచి బాల్‌సింగ్, చింతలపేట తండా నుంచి నెహ్రూ, చెల్క తాండా నుంచి గొట్టిపాటి శ్రీనివాస్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కోటగిరి మండలంలో రాంపూర్ నుంచి శాంకి బాయి, అడకాస్‌పల్లి నుంచి రెడ్డి రామకృష్ణ, దేవునిగుట్టతాండ నుంచి రవి నాయక్, సుద్దులం తండా నుంచి మౌనిక విజయ్, వల్లభాపూర్ నుంచి పుష్పలత విట్టల్ పటేల్ ఏకగ్రీవంగా గెలుపొందారు. పోతంగల్ మండలంలో నగర్ నుంచి రామ్ భాయి, చందూర్ మండలంలో లక్ష్మాపూర్ నుంచి చింతం ఉమా సంజీవ్, కారేగావ్ తండా నుంచి లాల్ సింగ్ ప్రజల సమగ్ర మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.బాన్సువాడ నియోజకవర్గంలో జరగనున్న మిగిలిన గ్రామపంచాయతీలలో కూడా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే సర్పంచులుగా ఎన్నికవుతారనే ధీమా వ్యక్తమైంది. ముఖ్యంగా మూడవ విడత నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న బాన్సువాడ గ్రామీణ, బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల్లో భారీగా ఏకగ్రీవాలు సాధించే పరిస్థితి నెలకొన్నదని పోచారం భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రజలు విశ్వాసం ఉంచడానికి ప్రధాన కారణమని ఆయన అన్నారు. ప్రజా ఆశయాల సాధనలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుండి పని చేస్తుందని కూడా తెలిపారు

# వరి కొనుగోలు వివరాలను యాప్ లో నమోదుంచేయాలి.



**కామారెడ్డి డిసెంబర్4( సమయం న్యూస్) :** వరి కొనుగోలు ప్రక్రియ లోకల్ యాప్ లో ఎంట్రీ ల పై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ విక్టర్, సురేందర్, సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, అదనపు ా అలాగే లు, %లు తదితర అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో జిల్లాలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల పనితీరును, ముఖ్యంగా లోకల్ యాప్‌లో జరుగుతున్న ట్యాబ్ ఎంట్రీల పురోగతిని కేంద్రాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు.లు ద్వారాలోకల్ యాప్‌లో ట్యాబ్ ఎంట్రీలు, 100% కంటే ఎక్కువ లేదా50% కంటే తక్కువగా ఉన్న మండలాలఅన్ని లకు కలెక్టర్ ఆరా తీశారు.లు ద్వారా లోకల్ యాప్‌లో ట్యాబ్ ఎంట్రీలు, 100% కంటే ఎక్కువ లేదా, 50% కంటే తక్కువగా ఉన్న ప్రాంతాలపర్యవేక్షణ అధికారులు, కార్యదర్శుల నుండి కూడా వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా అధికారులు ట్యాబ్ ఎంట్రీలను లోకల్ యాప్‌లో ఎప్పటికప్పుడు, ఖచ్చితంగా సమయానుసారం అప్డేట్ చేయాలని సూచించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి ఆలస్యం జరగకుండా సమన్వయం పాటించాలని ఆదేశించారు.ఖచ్చితంగా ఎంట్రీలు జరగాలని నిర్లక్ష్యం వహించిన వారి పై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు .

# స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు మిత్ర భావంతో మెలగాలి.



**రాయపోల్,,డిసెంబర్ 4:** రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రతి అభ్యర్థి, కార్యకర్త, ప్రజలు చట్టాలను పాటించాల్సిన అవసరం ఉందని తొగుట సీఐ లతీఫ్,ఎంపీడీవో శ్రీనివాసరావు లు స్పష్టం చేశారు.మండల కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యుల కోసం నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, మైక్ ప్రకటనలు జరపరాదు, ఓటర్లపై డబ్బు, మద్యం, బహుమతుల ప్రలోభాలు చూపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం, రెచ్చగొట్టే పోస్టులు, ఉద్రిక్తతలకు దారితీసే వ్యాఖ్యలు నియమావళికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో నిష్పాక్షికంగా ఎన్నికలు పూర్తయ్యేలా పోలీసు విభాగం చర్యలు తీసుకుంటోందని, అనుమానాస్పద ఘటనలు గమనించిన పక్షంలో వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మానస,ఎన్నికల అబ్జర్వర్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన నేత్రవైద్య శిబిరం - నేత్ర వైద్యులు భాస్కర్ గౌడ్.



**కోస్గి మున్సిపల్(మం)డిసెంబర్,04(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కోస్గి లయన్స్ క్లబ్ అధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిభిరం విజయవంతమైనట్లు నేత్ర వైద్యులు భాస్కర్ గౌడ్ తెలిపారు.గురువారం నిర్వహించిన ఉచిత కంటి చికిత్స శిబిరానికి మండల పరిధిలోని 33 మందికి కంటి పరీక్షిలు నిర్వహించగా వారిలో 28 మందికి కంటిశుక్లాల లోపాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు.వీరికి ఉచిత ఆపరేషన్లు కొరకు పాలమూరు లోని రాంరెడ్డి కంటి హాస్పిటల్ కు తరలించారు.ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ కోస్గి అధ్యక్షులు మహేందర్ గౌడ్ మాజీ లయన్స్ క్లబ్ అధ్యక్షులు పూర్ణచంద్రాయాదవ్, బెజ్జు వెంకట్ రాములు,మాజీ లయన్ సభ్యులు వెన్నశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఎస్ టి కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**సిద్దిపేట డిసెంబర్4( సమయం న్యూస్).:** చేర్యాల మండలం నేషనల్ హైవే రోడ్ వెంబడి ముస్యాల గ్రామం వద్ద గల ఎస్ ఎస్ టి శిబిరాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి వాహనాల పరిశీలన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజిస్టర్ వెరిఫై చేసి రిజిస్టర్ వెహికిల్ వచ్చిన టైమ్ ను తప్పనిసరిగా రాయాలని విధులు పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. వెహికల్ చెకింగ్ వీడియోస్ ను వీడియో కెమెరా లో చెక్ చేశారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు 24/7 ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలన మొత్తం వీడియో గ్రఫీ తప్పనిసరిగా చెయ్యాలని సిబ్బందిని ఆదేశించారు

# ఆరేపల్లిలో సర్పంచ్, వార్డు సభ్యులు ఏకగ్రీవం

- గ్రామంలో ఆనంద వాతావరణం.



**రాయపోల్,(ఆంధ్రప్రభ),డిసెంబర్ 4:** మండలం లోని పెద్ద ఆరేపల్లి గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికలు సాక్షాత్తూ ఏకగ్రీవాల పండుగలా మారాయి. సర్పంచ్ పదవి సహా గ్రామంలోని అన్ని వార్డు సభ్యుల స్థానాలు ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా పూర్తయ్యాయి.గ్రామ అభివృద్ధి, సామరస్యాన్ని కాపాడాలనే సంకల్పంతో ప్రజలు నాయకత్వాన్ని ఏకగ్రీవంగా నిలబెట్టడంతో గ్రామంలో ఉత్సాహ వాతావరణం నెలకొంది.గురువారం ఎంపీడీవో శ్రీనివాస్,ఆర్వో రజిత పర్యవేక్షణలో ఉపసర్పంచ్ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. వీరేశం ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు అన్ని వార్డు సభ్యులకు ఎన్నిక ధృవపత్రాలను ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్వో లు అందజేశారు.ఈ సందర్భంగా అధికారులు గ్రామ ప్రజల సహకారాన్ని ప్రశంసించారు.ఏకగ్రీవాల ద్వారా గ్రామం అభివృద్ధి మార్గంలో మరింత వేగంగా ముందుకు సాగుతుందనే నమ్మకం వ్యక్తమైంది. ఆరేపల్లి గ్రామం ఈసారి మొత్తం ఏకగ్రీవాలతో ప్రత్యేక దృష్టిని ఆకర్షించింది.

# బోట్లవాని తండా గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం ప్రారంభించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు

- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన
- బొట్లవాని తండా అభ్యర్థి బాలు నాయక్ ను భారీ మెజారిటీతో గెలిపించి..
- గ్రామ అభివృద్ధికి బాటలు వేయండి
- బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు నెహ్రూ నాయక్



**బొంరస్ పేట మండలం, డిసెంబర్,04(సమయం న్యూస్) :** కొడంగల్ నియోజకవర్గం బొంరాస్ పేట్ మండల గ్రామపంచాయతీ బోట్లవాని తండా ఎన్నికలో భాగంగా పూర్య నాయక్ తండా, దేవులా నాయక్ తండా, బోట్లవాని తండా లో శివుడు, జగదంబ, సేవాలాల్ మహారాజ్, హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి బాలు నాయక్ కు మద్దతుగా ఎన్నికల ప్రచారం ప్రారంభించిన బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు నెహ్రూ నాయక్, తండా నాయకులు శంకర్ నాయక్, మాజీ వార్డ్ మెంబర్ కాలు నాయక్, రవి నాయక్, రమేష్, విష్ణు, పులి సింగ్,మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన నవ యువ నాయకుడు బాలు నాయక్ కత్తెర గుర్తు మీద మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించి బోట్లవాని తండా అభివృద్ధికి బాటలు వేయాలని బోట్లవాని తండా ప్రజలను కోరారు.. ఈ కార్యక్రమంలో దేశ్య నాయక్, పుణ్య నాయక్, రేద్య, సునీల్, రాము,శివరాం, రాజు, రాహుల్,బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, తండా మహిళలు పాల్గొన్నారు.

# వలస కార్మికుల పిల్లల చదువును ప్రోత్సహిస్తాం

- ఇటుక బట్టీల్లో పిల్లలను బడిలో చేర్పించండి
- పోషకాహారం, వైద్యం అందజేస్తాం
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- గట్టుభూత్కూర్ లో ప్రత్యేక తరగతి ప్రారంభం



**కరీంనగర్ డిసెంబర్4( సమయం న్యూస్).:** జిల్లాలోని వలస కార్మికుల పిల్లల చదువును ప్రోత్సహిస్తామని, ఇందుకోసం జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో వారికి ప్రత్యేక తరగతి గదులను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. గంగాధర మండలం గట్టుభూత్కూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వలస కార్మికుల పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తరగతి గదిని కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఇక్కడ 42 మంది వలస కార్మికుల పిల్లలని గుర్తించి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు.

ఈ సందర్భంగా తరగతి గదిలోని చిన్నారులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వివిధ భాషల్లో పలుకరించి చదువు, స్వస్థలం, కుటుంబ సభ్యుల వివరాల వంటివి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వలస కార్మికుల పిల్లలందరినీ గుర్తించి వారికి సమీప పాఠశాలల్లో ప్రత్యేక తరగతి గదిలో విద్యా బోధన చేస్తున్నామని తెలిపారు. గత ఏడాది సుమారు 500 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్చి చదువు చెప్పించామని అన్నారు. ఈ సంవత్సరం కూడా మరిన్ని పాఠశాలల్లో ఈ పిల్లల కోసం ప్రత్యేక తరగతి గదులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాఠశాలకు వచ్చే పిల్లలందరికీ మధ్యాహ్న భోజనం, పోషకాహారం అందిస్తామని తెలిపారు. ప్రత్యేక మెడికల్ క్యాంపు ల ద్వారా వారి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తామని అన్నారు. వలస కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసే పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులను ఆదేశిం చారు. ఇటుక బట్టీల యజమానులతో మాట్లాడి పాఠశాల వరకు రవాణా సదుపాయం ఉండేలా చూడాలని సూచించారు.కార్మికుల పిల్లలు వివిధ రాష్ట్రాల నుండి వస్తున్నం దున వారికి ఇంగ్లీషులో బోధన చేయాలని సూచించారు. గణితం ఇంగ్లీషు సబ్జెక్టులను ముఖ్యంగా బోధించాలని విద్యా వాలంటీర్లను ఆదేశించారు. దీనివల్ల వారు భవిష్యత్తులో ఏ రాష్ట్రానికి వెళ్లినా ఉపయోగపడుతుందని అన్నారు. కార్మికుల పిల్లలకు అవసరమైన యూనిఫాం, పుస్తకాలు, నోట్ బుక్కులు వంటివి అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**పూర్వ ప్రాథమిక పాఠశాల సందర్శన ..**

విద్యాశాఖ ఆధ్వర్యంలో గట్టుబూత్కూరు మండల ప్రాథమిక పాఠశాలలోని పూర్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఇక్కడ పూర్వ ప్రాథమిక విద్య అభ్యసిస్తున్న పిల్లలతో మమేకమ య్యారు. ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని, ఇందు కోసం ప్రభుత్వం నుండి వచ్చిన అన్ని ఆట వస్తువు లను, పుస్తకాలను వినియోగించాలని సూచించారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంచాలని అన్నారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ రజిత, మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు తదితరులు ఉన్నారు.

# మైక్రో ఆబ్జర్వర్లు విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలి

**-సాధారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ బాషా**



**వికారాబాద్, డిసెంబర్,04(సమయం న్యూస్) :** జిల్లాలో పోలింగ్ రోజు మైక్రో అబ్జర్వర్లు విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలని జిల్లా సాధారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ భాష అన్నారు.గురువారం ఐ.డి.ఓ.సి సమావేశ హాలు నందు ఏర్పాటు చేసిన మైక్రో అబ్జర్వరు లు పోలింగ్ రోజున చేపట్టే విధివిధానాల శిక్షణా కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు యాస్మిన్ బాష జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ జిల్లా లో 594 గ్రామా పంచయతిలకు గాను 98 మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించడం జరుగుతుందని ,ఎన్నికల నిర్వహణ మొత్తానికి కండ్లు, చెవులు మైక్రోఅబ్జర్వర్లె నని , ఎన్నికల నియమావళి ని అనుసరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. వికారాబాద్,తాండూర్, కోడంగల్ , పరిగి నియోజకవర్గాలలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్ల విధులు కీలకమని అన్నారు. తప్పక చెక్ లిస్ట్ ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు.మైక్రో అబ్జర్వర్ల పోలింగ్ రోజున పోలింగ్ బూత్ లో జరిగే పోలింగ్ ప్రక్రియను పరిశీలన చేయడానికి నియమించడం జరుగుతుందని, వెబ్ క్యాస్టింగ్ ,పోలింగ్ బూత్ లో ప్రిసైడింగ్ అధికారికరెక్ట్ గా చేస్తున్నారా లేదా వారు చేసే ప్రతి అంశాన్ని పరిశీలన చేయాలని తెలిపారు.పోలింగ్ రోజున పోలింగ్ నిర్వహణ పరిశీలన చేయాలని సూచించారు.ఎంత మంది పోలింగ్ ఏజెంట్లు హాజరు అయినది లేనిది తప్పక చూడాలని అన్నారు.ముఖ్యంగా బ్యాలట్ బాక్సు ఖాళీ గా ఉన్నాయా లేదా చెక్ చేయాలనీ, సీలింగ్ చేస్తున్నారా, లేదా చెక్ చేసుకోవాలని,పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు పరిశీలన చేయాలని సూచించారు.మైక్రో అబ్జర్వర్ల లు పోలింగ్ ముగిసిన అనంతరం సాధారణ పరిశీలకులకు రిపోర్ట్ లు సబ్మిట్ చేయాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ లో ప్రశాంతంగా నిబద్ధతతో పనిచేయాలని పరిశీలనకు ప్రాధాన్యత ఉండాలని, విధుల పట్ల ఎలాంటి పొరపాట్లు జరుగకుండా విధులు నిర్వహించాలనిమైక్రో అబ్జర్వర్లు కు ఆదేశించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పోలింగ్ రోజు మైక్రో అబ్జర్వర్లు చేయాల్సిన విది విధానాలు మాస్టర్ ట్రైనర్స్ రామ్ రెడ్డి, కృష్ణా రెడ్డి పని చేయు విధానం గురించి వివరించారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డి ఆర్ డి ఓ శ్రీనివాస్. ఎల్ డి ఎం యాదగిరి, బి సి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, మైక్రో అబ్జర్వర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీసులకు ప్రత్యేక శిక్షణ

**డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్..**



**కోస్గి మున్సిపల్ డిసెంబర్,04(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా పరిధిలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహించేందుకు విధులు నిర్వర్తించే పోలీసులకుకోస్గి లోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు.గురువారం నారాయణ పేట జిల్లా ఎస్పీ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ నల్లపు లింగయ్య,డి సి ఆర్ బి డీఎస్పీ మహేష్ లు మార్గదర్శకులుగా పోలీసులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తప్పనిసరిగా పాటించాల్సిన చట్టపరమైన నిబంధనలు, ఎన్నికల కమీషన్ ఆదేశాలు, మరియు ప్రవర్తనా నియమావళి పై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉంటూ, రాజకీయ పార్టీలతో పక్షపాతం లేని విధంగా, చట్టపరంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు,అక్రమంగా డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ, ఓటర్లకు బెదిరింపులు లాంటి సంఘటనలు గమనిస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లకు పూర్తి రక్షణ, భద్రత సహకారం అందిస్తూ శాంతి భద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. ఏవైనా రాజకీయ పార్టీల ఒత్తిళ్లకు లోనుకాకుండా, ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి అని స్పష్టం చేశారు. ఓటు ప్రదేశాల్లో 163 బిఎన్ ఏస్ ఏస్ 144 సెక్షన్, డ్రై డే, ప్రత్యేక నిబంధనలు, మహిళా భద్రత వంటి అంశాలపై వివరించారు. సీసీ కెమెరాలు ద్వారా నిఘా ఉంచాలని, ఎలాంటి గొడవలు జరిగే ఆస్కారం ఉన్న గొడవలు జరుగుతున్న వెంటనే పై అధికారులకు నివేదించాలని సూచించారు.చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనించిన వెంటనే కేసులు నమోదు చేయాలని. పోలింగ్ స్టేషన్ల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ప్రచార నిషేధం, గుంపులు గుంపులుగా ఉండకుండా చూడాలని తెలిపారు.ఓటర్లపై ఒత్తిడి, ప్రలోభాలకు అవకాశమివ్వకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని అన్నారు.ఎటువంటి వివాదాలు తలెత్తినా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో కోస్గీ సిఐ సైదులు,ఎస్సై లు విజయ్ కుమార్,బాలరాజు,సర్కిల్ పరిధిలోని పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలకు రూట్ మ్యాప్‌లు సిద్ధం చేయండి,

- ఎన్నికలు సజావుగా సాగేందుకు
- అవసరమైన అన్ని చర్యలు తీసుకోండి,
- జోనల్ అధికారులకు కలెక్టర్ ఆదేశం.




**మహబూబ్ నగర్ డిసెంబర్4( సమయం న్యూస్). :** గ్రామ పంచాయతీల్లోని ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన రూట్లను పూర్తిగా పరిశీలించి, పోలింగ్ సిబ్బంది మరియు పోలింగ్ సామగ్రిని సులభంగా రవాణా చేయడానికి అనుకూలంగా రూట్ మ్యాప్‌లను తుది రూపం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి జోనల్ అధికారులకు ఆదేశించారు. గురువారం నాడు కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో జోనల్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె ఈ సూచనలు ఇచ్చారు. పంపిణీ కేంద్రాల నుండి వేగవంతంగా పంపిణీ చేయడానికి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర ఎన్నికలకు సంబంధించిన సామాగ్రి ముందుగానే సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఎన్నికల మార్గదర్శకాలను అనుసరించి అన్ని చర్యలు తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లుకు ఆదేశించారు. ఒక వేళ బ్యాలెట్ బాక్స్‌లు పనిచేయకపోవడం వంటి సమస్యలు తలెత్తిన పక్షంలో అదనపు బ్యాలెట్ బాక్స్‌లను వెంటనే అందుబాటులో ఉంచాలని జోనల్ అధికారులకు ఆమె స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరగేందుకు జోనల్ అధికారులు, రూట్ అధికారులు పోలింగ్ కేంద్రంల వద్ద ఉన్న ఎన్నికల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు విజయవంతంగా జరిగేటట్టు చూడవలసిన బాధ్యత జోనల్ అధికారుల మీద ఉందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శివేంద్ర ప్రతాప్, జోనల్ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, నోడల్ అధికారి వెంకటేశ్వర తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

- అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలో కలెక్టర్ పి. ప్రావీణ్య




**సంగారెడ్డి, డిసెంబర్ 03( సమయం న్యూస్) :** దివ్యాంగులు ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాలలో విజయాలను సాధించాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్లోని ఆడిటోరియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ,దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని, అప్పుడే వారు అనుకున్నది సాధించగలుగుతారన్నారు. అన్ని రంగాలలో దివ్యాంగులు సమాజంలోని సకలాంగులకు ఎంతమాత్రం తీసిపోకుండా తమ ప్రతిభను చాటుతు న్నారని పేర్కొన్నారు. దివ్యాంగులు సంతోషంగా సమాజానికి స్ఫూర్తిదాయకంగా ఉండాలని సూచించారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. జిల్లాలో దివ్యాంగుల పిల్లల కోసం ఐఆర్సి సెంటర్లు ఏర్పాటు చేశామని, అన్ని వసతులతో తీర్చిదిద్దుతున్నామని వివరించారు. ఎస్హెచ్ఈ ద్వారా పీడబ్ల్యుడి గ్రూప్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. దివ్యాంగులకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారం అందిస్తామని అన్నారు.

జిల్లా స్థాయి కమిటీ సమావేశం రెగ్యులర్గా ప్రతి క్వార్టర్ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని డీ డబ్ల్యూఓ కు సూచించారు. అనంతరం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయా క్రీడలలో ప్రథమ స్థానంలో గెలుపొందిన విజేతలకు వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతిని అందజేశారు. అంతకుముందు దివ్యాంగుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ లలిత కుమారి, లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సౌజన్య,సిడివి ఓలు, దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రవీణ్, జుబేదా, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, దివ్యాంగులు,పాల్గొన్నారు.

# వ్యయ పరిశీలకుల తనిఖీకి అభ్యర్థులు/వారి ప్రతినిధులు ప్రచార ఖర్చుల పూర్తి రికార్డులతో హాజరు కావాలి

- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్



**సంగారెడ్డి, డిసెంబర్ 04( సమయం న్యూస్) :** ఎన్నికలలో పోటీచేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ప్రచార ఖర్చులకు సంబంధించి ప్రతి పైసా నమోదు చేయాలనీ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు పూర్తి ఖర్చుల రికార్డులతో వ్యయ పరిశీలకుల పరిశీలనకు మూడుసార్లు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. రెండవ విడత ఎన్నికలు జరుగనున్న అందోల్, చౌటకూర్, పుల్కల్, వట్పల్లి, రాయికోడ్, ఝరాసంగం, జహీరాబాద్, మొగుడంపల్లి, కోహిర్, మునిపల్లి మండలాలకు సంబంధించి డిసెంబర్ 8 న మొదటి విడత, డిసెంబర్ 10న రెండవ విడత, డిసెంబర్ 12న మూడవ విడత గా మూడుసార్లు అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల రికార్డులను పరిశీలిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లాలో మూడవ విడత ఎన్నికలు జరుగనున్న కల్హేర్, కంగ్టి, మనూర్, నాగల్ గిద్ద, నారాయణఖేడ్, నిజాంపేట్, సిర్గాపూర్, న్యాల్కల్ మండలాలకు సంబంధించి డిసెంబర్ 11 న మొదటి విడత, 13న రెండవ విడత, 15న మూడవ విడత గా మూడుసార్లు అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల రికార్డులను పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఆయా తేదీలలో సంబంధిత మండల పరిషత్ అధికారి కార్యాలయంలో ఉదయం 10 నుండి 5 గంటల మధ్య ఎన్నికల ఖర్చుల రికార్డులను పరిశీలించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలనకు హాజరుకాని అభ్యర్థికి నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. నోటీసులకు సరియైన సంజాయిషీ లేనట్లయితే ఎన్నికల నియమ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు ఎన్నికల ఖాతా నిర్వహణ రిజిస్టర్లు, సంబంధిత డాక్యుమెంట్లతో పరిశీలకుల ముందు ఆయా తేదీలలో తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. 2011 జనాభా లెక్కల మేరకు 5 వేలకు పైగా జనాభా గల గ్రామపంచాయతీ లలో సర్పంచి అభ్యర్థి గరిష్ట వ్యయ పరిమితి రెండు లక్షల 50 వేలు కాగా, వార్డు మెంబర్లకు 50 వేల వ్యయ పరిమితి గలదని , 5 వేల లోపు జనాభా గల గ్రామపంచాయతీలకు సర్పంచ్ అభ్యర్థికి గరిష్ట వ్యయపరిమితి 1.5 లక్షలు, వార్డ్ మెంబర్ కు 30 వేలు అని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచార నిమిత్తం ఉపయోగించే వాహనాలకు స్థానిక తహసిల్దార్ దగ్గర అనుమతి పొందాలని , అనుమతి లేకుండా వినియోగించినట్లయితే ఎన్నికల నియమ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఎన్నికలలో ఖర్చు చేసే ప్రచార ఖర్చులకు సంబంధించి ప్రతి పైసాను తమ ఖర్చుల ఖాతాలో చూపించాలని ఆయన సూచించారు.

## లొంక ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్న పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి.





**పరిగి మండలం, డిసెంబర్,04(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని కాలాపూర్ గ్రామంలో ప్రసిద్ధమైన శ్రీ సప్తముఖ లొంక ఆంజనేయ స్వామి ఆలయాన్ని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గురువారం సందర్శించారు. ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకి ఆశీర్వచనాలు అందించి,స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

## చిత్తడి నెలలు గుర్తించేందుకు సర్వే చేయండి

- జిల్లా అటవీ శాఖ అధికారి లిఖిత



**కామారెడ్డి డిసెంబర్4( సమయం న్యూస్). :** జిల్లాలో ఉన్న చిత్తడి నేలలు ను గుర్తించడం, భూసర్వే చేయించడం, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ సిద్ధం చేయడం వంటి ముఖ్య అంశాల పై గురువారంజిల్లా కలెక్టర్ ఆద్వర్యం లో అటవీ శాఖ అధికారి నిఖిత మినీ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశం లో వెట్లాండ్ గుర్తింపు:జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్న సహజ, కృత్రిమ చెరువులు, కుంటలు, జలాశయాలు మొదలైన ప్రాంతాలను చిత్తడి నేలలు ప్రమాణాల ప్రకారం గుర్తించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఫీల్డ్ సర్వే:రెవెన్యూ, అరణ్య, నీటిపారుదల, ఫిషరీస్ శాఖల సంయుక్త బృందం ద్వారా స్థల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించారు.

డేటా సమీకరణ మరియు మ్యాపింగ్:ప్రతి చిత్తడి నేలలు సంబంధించిన సరిహద్దులు భూమి రికార్డులు, జీవవైవిధ్యం, నీటి ప్రవాహ మార్గాలు వంటి వివరాలను రూపొందించి మ్యాపింగ్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

డ్రాఫ్ట్ నోటిఫికేషన్ తయారీ:సర్వే వివరాల ఆధారంగా జిల్లా స్థాయిలో చిత్తడి నేలలకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని అధికారులు సూచించారు.

చిత్తడి నేలలు సంరక్షణ చర్యలు:చిత్తడి నేలలు ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలు, చెత్త పారవేయడం, కాలువ మూసివేత, సిల్టింగ్, వ్యర్థ జలాల ప్రవాహం మొదలైన కార్యకలాపాలు పూర్తిగా నిషేధించాలని నిర్ణయించారు.

శాఖల సమన్వయం:అన్ని శాఖలు పారదర్శకంగా, సమయపాలన తో డేటా అందించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ తెలిపారు "చిత్తడి నేలలు మన పర్యావరణ సమతుల్యతకు కీలకం. వాటి రక్షణ, పునరుద్ధరణ ప్రతి శాఖ బాధ్యత. జిల్లా స్థాయిలో వెట్లాండ్లను శాస్త్రీయంగా డాక్యుమెంట్ చేయడం అత్యవసరం"అనికలెక్టర్‌పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు విక్టర్, మదన్ మోహన్, రామకృష్ణ, సునీత , ఆటవి క్షేత్ర అధికారులు రమేష్, హబీబుద్దీన్ తదితరులు ఏరువులు) శాఖ, ఫిషరీస్ శాఖ, రెవెన్యూ శాఖ, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్, మీడియా సెంటర్లను పరిశీలించిన జనరల్ అబ్జర్వర్



**నిజామాబాద్, డిసెంబర్ 03( సమయం న్యూస్).** గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) సెల్ ను జనరల్ అబ్జర్వర్ శ్యాంప్రసాద్ లాల్ బుధవారం సందర్శించారు. ఎంసిఎంసి ద్వారా చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే చెల్లింపు వార్తలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్ ను సందర్శించి భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల సామాగ్రిని పరిశీలించారు. కంట్రోల్ రూమ్ ను సందర్శించి ఎన్నికల అంశాలకు సంబంధించి ఫోన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, వాటిపై చేపట్టిన చర్యల గురించి ఆరా తీశారు. మానిటరింగ్ సెల్ ను తనిఖీ చేసి, నిఘా బృందాల పని తీరును పర్యవేక్షిస్తున్న విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్ జక్రాన్పల్లి మండలం అర్గుల్, ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి, నందిపేట మండలం వన్నెల్(కే), డొంకేశ్వర్ గ్రామ పంచాయతీలను సందర్శించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. అబ్జర్వర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, డీఆర్డీఓ సాయాగౌడ్, ఎంసిఎంసి కమిటీ మెంబర్ సెక్రెటరీ ఎన్.పద్మశ్రీ, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్ తదితరులు ఉన్నారు.



గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫెరెన్స్ హాల్ లో గ్రామపంచాతి ఎన్నికల ప్రిసైడింగ్, పోలింగ్ అధికారుల రెండవ ర్యండామైజేషన్ ను ఎన్నికల సాధారణ పరిశీలకులు టి.వెంకన్న, వ్యయ పరిశీలకులు విజయ తో కలిసి నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా. పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డిపిఓ రమేష్, డిఆర్డీఓ రవీందర్, డిఎల్పీవో ఫణిందర్, సిబ్బంది. తదితరులు.

# ఎన్నికల కోడ్ పక్కాగా అమలయ్యేలా చూడాలి

● రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని

**నిజామాబాద్, డిసెంబర్ 04 ( సమయం న్యూస్).** గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమలులో ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని సూచించారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్ల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, జనరల్ అబ్జర్వర్ శ్యాంప్రసాద్ లాల్ ఇతర అధికారులు వీ.సీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన స్టేజ్ 2 జోనల్ ఆఫీసర్ల శిక్షణ తరగతులు, సర్వీస్ ఓటర్లు, పోస్టల్ బ్యాలెట్ కు ఏర్పాట్లు, వెబ్ కాస్టింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ షెడ్యూల్ తదితర అంశాలపై కమిషనర్ సమీక్షించారు.

# ర్యాండమైజేషన్ విధానంలో ఎన్నికల సిబ్బంది కేటాయింపు పూర్తి

**కరీంనగర్ డిసెంబర్4( సమయం న్యూస్) :** గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి రెండవ విడత పోలింగ్ సిబ్బంది కేటాయింపు ర్యాండమైజేషన్ విధానంలో పూర్తి చేశారు.

కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సాధారణ పరిశీలకులు వెంకటేశ్వర్లుతో కలిసి రెండో విడత పోలింగ్ ఆఫీసర్లను, సిబ్బందిని ర్యాండమైజేషన్ విధానంలో కేటాయించారు. జిల్లాలో రెండో విడతలో చిగురుమామిడి, గన్నేరువరం, తిమ్మాపూర్, మానకొండూర్, శంకరపట్నం మండలాల్లో నిర్వహించనున్న ఎన్నికలకు గ్రామపంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ల జారీపై సమగ్రమైన అవగహన కలిగి ఉండాలని

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాల పల్లి డిసెంబర్4( సమయం న్యూస్)? :.** గురువారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని విభాగాల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల మొదటి దశకు ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో విధులు నిర్వహించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ల కు జారీ, పంపిణీ ప్రక్రియలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించాలన్నారు.

మొదటి దశలో గ గణపురం, రేగొండ, కొత్తపల్లి గోరి, మొగుళ్ళపల్లి మండలాలలో ఎన్నికల నిర్వహణలో ఎలాంటి చిన్న పొరపాటుకు అవకాశం ఇవ్వకుండా ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌ల పంపిణీని ఎలాంటి. పొరపాటుకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు. మొదటి విడత జరుగనున్న పోలింగ్ లో వెబ్ కాస్టింగ్ 38, మైక్రో అబ్జర్వర్లు 36 విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పోస్టల్ బాలెట్ నోడల్ అధికారి ఇందిర, అన్ని విభాగాల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**జనగాం డిసెంబర్4( సమయం న్యూస్) :** ఈ నెల 11 న జరిగే మొదటి విడత ఎన్నికల సందర్భంగా ఆయా మండలాల్లో చేస్తున్న ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ క్షేత్ర స్థాయిలో గురువారం పరిశీలించారురఘునాథ్ పల్లి మండల తహసీల్దార్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారుసర్వీస్ ఓటరు లకు పోస్ట్ ద్వారా చేస్తున్న పోస్టల్ బ్యాలట్ పత్రాల పంపిణి ప్రక్రియ ను కలెక్టర్ పరిశీలించి. తహసీల్దార్, ఎంపీడీఓ కి పలు సూచనలు జారీ చేసారుసర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగు ఏర్పాట్లు చేయాలన్నారుఎన్నికల సంఘం మార్గదర్శకాల పట్ల పూర్తో లిగి ఉండాలని, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకె... వైజ్ఞానిక ప్రదర్శనలు

● పుస్తకాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అలవరుచుకోవాలి

● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ డిసెంబర్04( సమయం న్యూస్) :** జిల్లాస్థాయి ఇన్స్పైర్, సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని జిల్లా విద్యా శాఖ అధికారులుగురువారం స్థానిక వెస్లీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు లిసైన్స్ ఫెయిర్ కన్వీనర్ కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లా విద్యాధికారి విజయ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యారిని విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జ్యోతి ప్రజ్వలన గావించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారుజిల్లా లికలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ... ఎంచుకున్నటువంటి థీమ్,సబ్ థీమ్లు అభిరుచులకు తగ్గట్టుగా ఈ కాలానికి, మన దేశానికి అవసరమై నటువంటివిగా ఉన్నాయన్నారు. విద్యార్థులు కేవలం సైన్స్ చదవడం కాకుండా ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని తమ జ్ఞానాన్ని ఇంకా పెంపొం దించుకోవాలని కలెక్టర్ సూచించారు స్మార్ట్ ఫోన్ ద్వారా అందుబాటులో ఉన్నటువంటి ఏ ఐ ఆప్స్(ద్వారా ఎటువంటి సమాచారాన్ని అయినా సరైన సూచనలు ఇచ్చి మనం పొందగలిగే అవకాశం ఉన్నందున విద్యార్థులు ఈ యొక్క అవకాశాన్ని మంచికి ఉపయోగించి తమ జ్ఞానాన్ని పెంపొందించుకొని మంచి భవిష్యత్తు పొందాలని ఆయన సూచించారు. పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా లాంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని మన పాఠశాల విద్యార్థులందరికీ కోర్స్ మెటీరియల్ పొందే అవకాశం కల్పించిందని తమ వద్ద ఉన్నటువంటి స్మార్ట్ ఫోన్ల ద్వారా ఉపాధ్యాయుల సహకారంతో ఖాన్ అకాడమీ ఫిజిక్స్ వాలా కి సంబంధించిన బోధన వీడియోలు వీక్షించాలని, కాలాన్ని వృధా చెయ్యరాదని, స్మార్ట్ ఫోన్ ను మంచి పనులకు ఉపయోగించాలని ఆయన అన్నారు. సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ అధికారులని కలెక్టర్ ప్రశంసించారు జిల్లా విద్యాశాఖ అధికారి విజయ మాట్లడుతూ...భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని, తమ తమ అభిరుచి, ఆసక్తి అనుగుణంగా తమ కోర్సు ఎంచుకొని జీవితంలో రాణించాలని విద్యార్థులకు సూచించారు.

# నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల డిసెంబర్ 4,( సమయం న్యూస్) :** రాష్ట్రంలో 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో 3వ విడత నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండలంలో భీమారం, పోలంపల్లి, ఆరేపల్లి గ్రామాలకు భీమారం గ్రామపంచాయతీ, బూర్గుపల్లి, నర్సింగాపూర్ (బి) గ్రామాలకు బూర్గుపల్లి గ్రామపంచాయతీ, దాంపూర్, ధర్మారం, కాజిపల్లి గ్రామాలకు కాజిపల్లి గ్రామపంచాయతీ లలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, సి.ఐ. నవీన్ లతో కలిసి సందర్శించి నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని, నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే నామినేషన్లను తీసుకోకూడదని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్లు పరిశీలించి అర్హులు, అనర్హుల జాబితాలో పూర్తి వివరాలతో రూపొందించాలని, ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా నూతన బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలని తెలిపారు. ఎన్నికల గుర్తుల కేటాయింపులు జాగ్రత్త వహించాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అవసరమైన సామాగ్రి జిల్లాలో అందుబాటులో ఉందని, అవసరం మేరకు వినియోగించుకోవాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించి ఆహారం తయారీ సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించడంతో పాటు సిబ్బంది పరిశుభ్రత నిబంధనలను పాటించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శం.

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
● మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శమని
● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.



**పెద్దపల్లి, డిసెంబర్ -04( సమయం న్యూస్). :** గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో నిర్వహించిన కొణిజెటి రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజా తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కొణిజెటి రోశయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి వైయస్సార్ హయాంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారని, ఆర్థిక శాఖ తో పాటు రోడ్లు భవనాల రవాణా శాఖ మంత్రిగా హౌసింగ్ శాఖ మంత్రిగా ,విద్యుత్ శాఖ మంత్రిగా హెూమ్ మినిస్టర్, వైద్య ఆరోగ్యం, విద్యాశాఖ మంత్రిగా కూడా కొంతకాలం తన సేవలు అందించారని, వైయస్సార్ హఠాన్మరణం తర్వాత ముఖ్య మంత్రి గా కొంత కాలం సేవలు అందించారని , అనంతరం తమిళనాడు గవర్నర్ గా పని చేసారని తెలిపారు. మహనీయులను ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితం చేయకుండా ఆయన ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమం లో , జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి సురేష్ , ఇతర జిల్లా అధికారులు, కలెక్టరెట్ సిబ్బంది, పాల్గొన్నారు.

# గ్రేటర్ హైదరాబాద్ లో27 పురపాలికల విలీనంతో మా బాధ్యత మరిత పెరిగింది.

● దేశంలోనే అతిపెద్ద మహా నగరం హైదరాబాద్ కు మేయర్, డిప్యూటీ మేయర్ లుగా ఉండడం మాకు గర్వ కారణం. సంతోషంగా ఉంది.
● సీఎం రేవంత్ రెడ్డి గారి చారిత్రక నిర్ణయాన్నిమనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాము
● దేశంలోనే అతిపెద్ద మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్ ను మార్చినందుకు సీఎం కు ధన్యవాదాలు
● మేయర్, డిప్యూటీ మేయర్- ఇక పై హైదరాబాద్ తో సమానంగా విలీన పురపాలికల అభివృద్ధి
● జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ సుందరీకరణ పనుల ప్రారంభోత్సవంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



**హైదరాబాద్, డిసెంబర్ 04,( సమయం న్యూస్). :** 20 మునిసిపాలిటీలను, 7 కార్పొరేషన్ లు ను కలిపి ఒకే మహా హైదరాబాద్‌గా మార్చాలనే గొప్ప కల ఇప్పుడు సాకారమైంది. సీఎం రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రభుత్వచారిత్రక నిర్ణయాన్నిమనస్ఫూర్తిగా స్వాగతిస్తునా ్నము. ముఖ్యమంత్రి కి హైదరాబాద్ ప్రజల తరుపున మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాము అంటూ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ విలీనంతో మాపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. లిగురువారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ, డా బి ఆర్ అంబేద్కర్ విగ్రహాలను డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి తో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆవిష్కరించారు.

అనంతరం మహనీయులకు మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ ఆర్ వి కర్ణన్, అదనపు కమిషనర్ లు, విభాగ అధిపతులు, ఉద్యోగ సంఘాల నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం మేయర్ గేట్ ప్రాంగాణంలో పౌంటేన్ సహా సుందరీకరణ పనులకు ప్రారంభోత్సవం చేశారు. సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.....దాదాపు రెండు దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించుకోవడం , హెడ్ ఆఫీస్ కు కార్పొరేట్ లుక్ వచ్చేలా సుందరీకరణ పనులు ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు,అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకుల సహకారం వల్లే సాధ్యమైందన్నారు. అనంతరం మేయర్ జీహెచ్ఎంసీ లో పురపాలికల విలీనం పై స్పందించారు. 27 పురపాలికల విలీన నిర్ణయంతో

650 చదరపు కిలో మీటర్ల నుంచి 2000 చదరపు కిలో మీటర్ల విస్తరించిందన్నారు. ఫలితంగా హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద మెట్రోపాలిటన్ నగరంగా అవతరించిందన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న జీహెచ్ఎంసీ లో పురపాలికలు భాగం కావడం వల్ల ఇక పై హైదరాబాద్ తో సమానంగా విలీన పురపాలికల అభివృద్ధి చెందుతాయనీ చెప్పారు. ప్రజలకు వేగంగా, సులభంగా సేవలు పొందగలుగుతారని మేయర్ చెప్పారు.

దేశంలోనే అతిపెద్ద మహా నగరం హైదరాబాద్ కు మేయర్, డిప్యూటీ మేయర్ లుగా ఉండడం మాకు గర్వ కారణం. సంతోషంగా ఉందనీ మేయర్ తెలిపారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ. ..జీహెచ్ఎంసీ లో ఏకకాలంలో 27 పురపాలికలు విలీనం కావడం సంతోషంగా ఉందన్నారు. శివారు పురపాలికల్లో అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గారి చారిత్రక నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు మేయర్ , డిప్యూటీ మేయర్ లు ప్రకటించారు.


## మాజీ ముఖ్యమంత్రి , గవర్నర్ కొణిజేటి రోశయ్య కు మేయర్, డిప్యూటీ మేయర్ నివాళులు

జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లోమాజీ ముఖ్యమంత్రి , గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతిసందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, అధికారులు నివాళులు అర్పించారు. అజాత శత్రువు రోశయ్య అని, వారి సేవలు ఎనలేనివని కొనియాడారు.

# దక్షిణాఫ్రికాపై కోహ్లీ ఆధిపత్యం..

భారత క్రికెట్ 'రన్ మెషిన్' విరాట్ కోహ్లీ మరోసారి మైదానంలో తన ఆధిపత్యాన్ని చాటుతున్నాడు. దక్షిణాఫ్రికాతో రాయ్‌పూర్‌లో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో కోహ్లీ అద్భుతమైన 102 పరుగులు చేసి తన అంతర్జాతీయ కెరీర్‌లో 84వ శతకం సాధించాడు. ఈ సిరీస్‌లో అతని ఫామ్ అద్భుతంగా ఉంది, ఎందుకంటే మొదటి మ్యాచ్ తర్వాత వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అతని బ్యాట్ నుంచి సెంచరీ వచ్చింది. ఈ సెంచరీతో కోహ్లీ వన్డే క్రికెట్‌లో మొత్తం 53 సెంచరీలు పూర్తి చేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ప్రారంభ వైఫల్యం తర్వాత విరాట్ కోహ్లీ అద్భుతంగా పుంజుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న సిరీస్‌లో అతని బ్యాట్ ఫైర్ మీద ఉంది. రాయ్‌పూర్‌లో చేసిన 102 పరుగుల సెంచరీతో ఇప్పుడు ఆఫ్రికన్ జట్టుపై అతని వన్డే సెంచరీల సంఖ్య 7కి చేరుకుంది. ఈ ప్రదర్శనతో కోహ్లీ 2027 వన్డే ప్రపంచ కప్‌లో భారత్ కోసం కీలక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నాడని స్పష్టంగా తెలుస్తోంది. వన్డే ఫార్మాట్‌లో సెంచరీల రికార్డులో విరాట్ కోహ్లీ ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్నాడు. గణాంకాలను పరిశీలిస్తే, కోహ్లీకి శ్రీలంక బౌలర్లు బాగా నచ్చారు. అతను శ్రీలంకతో ఆడిన 56 మ్యాచ్‌లలో 54 ఇన్నింగ్స్‌లలో అత్యధికంగా 10 సెంచరీలు సాధించాడు. ఆ తర్వాత వెస్టిండీస్ ఉంది, దీనిపై కోహ్లీ 43 మ్యాచ్‌ల్లో 9 సెంచరీలు నమోదు చేశాడు. వన్డే సెంచరీలలో సచిన్ టెండూల్కర్ (49) రెండో స్థానంలో, రోహిత్ శర్మ (33) మూడో స్థానంలో ఉన్నారు. రాయ్‌పూర్‌లో 102 పరుగులు చేసి అవుటైన కోహ్లీకి ఇప్పుడు విశాఖపట్నంలో జరిగే మూడో వన్డేలో చరిత్ర సృష్టించే సువర్ణావకాశం ఉంది. అంతర్జాతీయ క్రికెట్ మూడు ఫార్మాట్‌లలో (టెస్ట్, వన్డే, టీ20) కలిపి 28,000 పరుగులు పూర్తి చేయడానికి కోహ్లీకి ఇప్పుడు కేవలం 90 పరుగులు మాత్రమే అవసరం. మూడో మ్యాచ్‌లో ఈ పరుగులు చేస్తే సచిన్ టెండూల్కర్, కుమార సంగక్కర తర్వాత ఈ ఘనత సాధించిన ప్రపంచ మూడో బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు. దక్షిణాఫ్రికాపై 33 వన్డేల్లో, విరాట్ కోహ్లీ 31 ఇన్నింగ్స్‌లలో 1741 పరుగులు చేశాడు, 50o పరుగుల 15 సార్లు సాధించాడు, ఇది ప్రోటీస్‌పై ఏ భారతీయ బ్యాట్స్‌మన్ చేసిన అత్యధిక స్కోరు. రాయ్‌పూర్‌లో తన సెంచరీతో, విరాట్ కోహ్లీ ఇప్పుడు 34 వేర్వేరు వేదికల్లో వన్డే సెంచరీలు సాధించాడు, వివిధ మైదానాల్లో అత్యధిక సెంచరీలు చేసిన టెండూల్కర్ రికార్డును సమం చేశాడు.



## అనుష్క మద్దతుకు నెటిజన్లు ఫిదా

దక్షిణాఫ్రికాతో రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఓటమి పాలైనప్పటికీ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన అద్భుత శతకంతో అభిమానులను అలరించాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ సెంచరీ సాధించిన వెంటనే ఆయన భార్య, బాలీవుడ్ నటి అనుష్క శర్మ సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. విరాట్ కోహ్లీ తన 53వ వన్డే శతకాన్ని (ఓవరాల్‌గా 86వ అంతర్జాతీయ సెంచరీ) పూర్తి చేసుకున్న కాసేపటికే, అనుష్క శర్మ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక ప్రత్యేక పోస్ట్ పెట్టారు. మైదానంలో విరాట్ కోహ్లీ బ్యాట్ పైకెత్తి ప్రేక్షకులకు అభివాదం చేస్తున్న ఫోటోను షేర్ చేసిన ఆమె, దానికి 'హార్ట్' , 'చప్పట్లు' ఎమోజీలను జత చేశారు. ఎలాంటి రాతపూర్వక క్యాప్షన్ లేకపోయినా, ఈ ఎమోజీలతోనే ఆమె తన భర్త ప్రదర్శన పట్ల ఎంత గర్వంగా ఉందో తెలియజేశారు. ప్రస్తుతం ఈ స్క్రీన్ షాట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ (102), రుతురాజ్ గైక్వాడ్ (105) సెంచరీలతో చెలరేగడంతో భారత్ 358 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే, బౌలర్ల వైఫల్యం కారణంగా దక్షిణాఫ్రికా ఈ లక్ష్యాన్ని ఛేదించి 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జట్టు ఓడిపోయినప్పటికీ, కోహ్లీ పోరాటపటిమకు, అనుష్క మద్దతుకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. గత ఆదివారం రాంచీలో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో, డిసెంబర్ 6, శనివారం విశాఖపట్నంలో జరగనున్న మూడవ, చివరి మ్యాచ్ సిరీస్ విజేతను నిర్ణయించనుంది. సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ తన 52వ శతకాన్ని సాధించి, భారత్‌ను 349/8 స్కోరుకు చేర్చడంతో అతనికి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఆ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా తమ ఇన్నింగ్స్‌లోని 50వ ఓవర్లో 332 పరుగులకు ఆలౌట్ అయింది. ఇదిలా ఉండగా, డిసెంబర్ 11న తమ 8వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్న అనుష్క, విరాట్ లండన్‌కు మకాం మార్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ జంట డిసెంబర్ 2017లో ఇటలీలో అంగరంగ వైభవంగా వివాహం చేసుకున్నారు. వీరికి 2021లో కుమార్తె 'వామిక', 2024 ఫిబ్రవరిలో రెండవ సంతానంగా కుమారుడు 'అకాయ్' జన్మించిన సంగతి తెలిసిందే.

## ఆసీస్ గడ్డపై రూట్ సెంచరీ



2025 యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా- ఇంగ్లాండ్ మధ్య రెండో టెస్టులో తొలి రోజు ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో తొలుత బ్యాటింగ్ చేస్తున్న ఇంగ్లాండ్ 325-9 స్కోర్‌తో ఉంది. క్రీజులో జో రూట్ (135 పరుగులు), జోఫ్రా ఆర్చర్ (32 పరుగులు) ఉన్నారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 6, మిచెల్ నజీర్, స్కాట్ బొలాండ్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో రూట్ బ్యాటింగే హైలైట్. తన టెస్టు కెరీర్‌లో తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ సాధించాడు. ఆస్ట్రేలియాలో రూట్ శతకం నమోదు చేసేందుకు 30 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు. అలాగే రూట్ కెరీర్‌లో ఇది 40వ టెస్టు సెంచరీ కావడం విశేషం. కెరీర్‌లో లోటుగా మారిన ఈ సెంచరీని సాధించేందుకు జోరూట్‌కు తాజా పర్యటనలో మూడు ఇన్నింగ్స్‌ల సమయం పట్టింది. తొలి టెస్ట్‌లో దారుణంగా విఫలమైన జోరూట్.. పింక్ బాల్ టెస్ట్‌లో తన ట్రేడ్ మార్క్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. మిచెల్ స్టార్క్ ధాటికి ఆదిలోనే బెన్ డకెట్, ఓలీ పోప్ డకౌటవ్వగా.. జాక్ క్రాలీ(76)తో కలిసి జోరూట్ జట్టును ఆదుకున్నాడు. మూడో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. జాక్ క్రాలీ వెనుదిరిగినా.. హ్యారీ బ్రూక్(31), బెన్ స్టోక్స్(19), విల్ జాక్స్(19), జోఫ్రా ఆర్చర్(32 బ్యాటింగ్)ల సాయంతో విలువైన భాగస్వామ్యాలను నెలకొల్పాడు. ఈ క్రమంలో 83 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న జోరూట్.. 181 బంతుల్లో శతకాన్ని పూర్తి చేశాడు. ఈ భారీ ఇన్నింగ్స్‌తో ఆస్ట్రేలియా గడ్డపై 1000 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఇప్పటి వరకు ఆసీస్ గడ్డపై 30 ఇన్నింగ్స్‌లు ఆడిన జోరూట్ 1006 పరుగులు చేశాడు. ఇందులో తాజా సెంచరీతో పాటు 9 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో జోరూట్‌కు ఇది 22వ సెంచరీ. ఇప్పటికే ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్న జోరూట్.. తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. మరే బ్యాటర్ కూడా అతనికి దరిదాపుల్లో లేడు. డబ్ల్యూటీసీ చరిత్రలో 129 ఇన్నింగ్స్‌లు ఆడిన జోరూట్ 22 శతకాలు చేయగా.. స్టీవ్ స్మిత్ 13, మార్నస్ లబుషేన్ 11, కేన్ విలియమ్సన్ 11, శుభ్‌మన్ గిల్ 10 సెంచరీలతో తర్వాతి స్థానంలో నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక సెంచరీలు బాదిన బ్యాటర్ల జాబితాలో జోరూట్(59లి) అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. అలిస్టర్ కుక్(38), కెవిన్ పీటర్సన్(32), గ్రహమ్ కోచ్(28), ఆండ్రూ స్ట్రాస్(27) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలతో సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉండగా.. విరాట్ కోహ్లీ(84), రికీ పాంటింగ్(71), కుమార సంగక్కర(63), జాక్వాస్ కల్లీస్(62), జోరూట్(59లి) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. జోరూట్ సెంచరీతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 74 ఓవర్లలో 9 వికెట్లకు 325 పరుగులు చేసింది. క్రీజులో జోరూట్(135 బ్యాటింగ్), జోఫ్రా ఆర్చర్(32 బ్యాటింగ్) ఉన్నాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/71) ఆరు వికెట్లు తీయగా.. మైఖేల్ నెజర్, స్కాట్ బోలాండ్ తలో వికెట్ తీసారు.

## సెలెక్టర్లపై రింకూ అభిమానుల ఆగ్రహం



దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు బీసీసీఐ జట్టును ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ 15 మంది ఆటగాళ్లకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు, శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా, హార్దిక్ పాండ్యా తిరిగి జట్టులోకి వచ్చారు. రింకు సింగ్‌ను జట్టు నుంచి తొలగించడంపై చాలా మంది అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, సోషల్ మీడియాలో సెలెక్టర్లను విమర్శిస్తున్నారు. రింకు సింగ్ ఫినిషర్ పాత్ర పోషిస్తున్నాడు, అయితే అతనికి ప్లేయింగ్ ఎలెవెన్‌లో స్థిరమైన అవకాశాలు రాలేదు. హార్దిక్ పాండ్యా గాయం కారణంగా అతను కేవలం ఆసియా కప్ ఫైనల్‌లో మాత్రమే ఆడే అవకాశం లభించింది. ఈ సంవత్సరం, రింకు ఆరు టీ20లలో ఆడాడు, వాటిలో మూడు మ్యాచ్‌లలో బ్యాటింగ్ చేశాడు. అతనికి పరిమిత అవకాశాలు లభించినప్పటికీ, అతను చాలా మ్యాచ్‌లలో తనదైన ముద్ర వేశాడు. ఇప్పుడు, దక్షిణాఫ్రికాతో జరిగే టీ20 సిరీస్ నుంచి తొలగించడంతో, అతని అభిమానులు సెలెక్టర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక వినియోగదారుడు రింకు సింగ్ టీ20 గణాంకాలను ప్రస్తావిస్తూ, అతను టీ20లలో భారతదేశపు అత్యుత్తమ ఫినిషర్ అని పేర్కొన్నాడు, అయినప్పటికీ అతన్ని తొలగించారు. మరొక వినియోగదారుడు చీఫ్ సెలెక్టర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై తమకు నచ్చిన ఆటగాళ్లను ఎంచుకున్నారని ఆరోపించారు. మరొక వినియోగదారుడు వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ చివరి ఓవర్లలో వేగంగా పరుగులు చేయలేరని, సంజు శామ్‌సన్ కూడా ఫినిషర్ కాదని రాశారు. రింకు సింగ్ 35 మ్యాచ్‌లలో 25 ఇన్నింగ్స్‌లలో మొత్తం 550 పరుగులు చేశాడు. ఈ ఫార్మాట్‌లో అతని అత్యధిక స్కోరు 69లి, అతని స్ట్రైక్ రేట్ 161.76, సగటు 42.30. అతను టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో మూడు అర్ధ సెంచరీలు సాధించాడు.

## టీ20 క్రికెట్‌లో రోహిత్ రీఎంట్రీకి రెడీ



టీమిండియా టెస్టు, వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన ఈ స్టార్ బ్యాటర్, దేశవాళీ టీ20 టోర్నమెంట్ అయిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆడేందుకు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. రోహిత్ శర్మ తన సొంత జట్టు ముంబై తరపున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లలో ఆడేందుకు ఆసక్తి చూపించినట్లు సమాచారం. ఈ విషయాన్ని ముంబై క్రికెట్ అసోసియేషన్ వర్గాలు ధృవీకరించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ముంబై జట్టు లీగ్ దశలో అద్భుత ప్రదర్శనతో నాకౌట్‌కు చేరడం ఖాయంగా కనిపిస్తోంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లు డిసెంబర్ 12 నుంచి 18 మధ్య జరగనున్నాయి. ప్రస్తుతం రోహిత్ శర్మ దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ఆడుతున్నారు. ఈ సిరీస్ డిసెంబర్ 6న ముగుస్తుంది. ఆ తర్వాత రోహిత్ ముంబై జట్టుకు అందుబాటులో ఉంటారు. 2024 టీ20 వరల్డ్ కప్ విజయానంతరం రోహిత్ శర్మ అంతర్జాతీయ టీ20లకు గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ టీ20 ఫార్మాట్‌లో బ్యాట్ పట్టుకునేందుకు సిద్ధమవ్వడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాబోయే ఐపీఎల్ సీజన్‌కు సన్నాహకంగా రోహిత్ ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా, హిట్ మ్యాన్ మరోసారి టీ20ల్లో మెరుపులు మెరిపించనుండటం ముంబై జట్టుకు అదనపు బలాన్ని చేకూర్చనుంది.


## డెవాల్డ్ బ్రెవిస్ బ్యాటింగ్ మైండ్ బ్లోయింగ్

### టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్

సౌతాఫ్రికా యువ బ్యాటర్, చెన్నై సూపర్ కింగ్స్ హిట్టర్ డెవాల్డ్ బ్రెవిస్‌పై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల జల్లు కురిపించాడు. భారత్‌తో రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో అతని బ్యాటింగ్ అద్భుతంగా ఉందని కొనియాడాడు. ఈ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన సౌతాఫ్రికా 4 వికెట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 358 పరుగుల భారీ స్కోర్ చేసింది. విరాట్ కోహ్లీ(93 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సలతో 102), రుతురాజ్ గైక్వాడ్(83 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సలతో 105) సెంచరీలతో చెలరేగగా.. కెప్టెన్ కేఎల్ రాహుల్(43 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సలతో 66 నాటౌట్) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్(2/63) రెండు వికెట్లు తీయగా.. నంద్రే బర్గర్(1/43), లుంగి ఎంగిడి(1/51) చెరో వికెట్ తీసారు. అనంతరం సౌతాఫ్రికా 49.2 ఓవర్లలో 6 వికెట్లకు 362 పరుగులు చేసి గెలుపొందింది. ఓపెనర్ ఎయిడెన్ మార్క్రమ్(98 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సలతో 110) సెంచరీతో చెలరేగగా.. మాథ్యూ బ్రీట్జ్‌కే(64 బంతుల్లో 5 ఫోర్లతో 68), డెవాల్డ్ బ్రెవిస్(34 బంతుల్లో ఫోర్, 5 సిక్సలతో 54) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ రెండేసి వికెట్లు తీయగా.. హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్ చెరో వికెట్ పడగొట్టారు. కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్ శతకాలతో చెలరేగినా తనను డెవాల్డ్ బ్రెవిస్ బ్యాటింగ్ ఆకట్టుకుందని అశ్విన్ ట్వీట్ చేశాడు. అతని బ్యాటింగ్ బాక్సాఫీస్ హిట్ అని ఎక్స్‌వేదికగా పేర్కొన్నాడు. 'బ్రేవ్ బాల్ ఈజ్ బాక్సాఫీస్'అని ట్వీట్ చేశాడు. అతని ఫియర్‌లెస్ గేమ్ అమోఘమని, అద్భుతమైన సినిమాను చూసినట్లుందని పేర్కొన్నాడు. డెవాల్డ్ బ్రెవిస్ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను తమవైపు మలుపు తిప్పాడు. 5 భారీ సిక్సలతో భారత బౌలర్లకు చుక్కలు చూపించాడు.








# బాహుబలి కోసం జపాన్‌కు ప్రభాస్

## స్పిరిట్ షూట్‌కు తాత్కాలిక బ్రేక్

గ్లోబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడు. ముందుగా ప్రకటించిన ప్రకారం జపాన్‌లో బాహుబలి : ది ఎపిక్ స్పెషల్ ప్రీమియర్‌కు హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభాస్ గురువారం జపాన్‌కు వెళ్లాడు. ఈవెంట్‌కు బాహుబలి ప్రాంచైజీ నిర్మాత శోభు యార్లగడ్డ కూడా హాజరు కానున్నారు. బాహుబలి : ది ఎపిక్ జపాన్‌లో డిసెంబర్ 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మేరకు మేకర్స్ డిసెంబర్ 5, 6వ తేదీల్లో స్పెషల్ ప్రీమియర్స్ ఏర్పాటు చేశారు. ప్రభాస్ కల్కి 2898 ఏడీ ప్రమోషన్స్ టైంలో జపాన్‌లో తాను కలవలేకపోయిన అభిమానులను కలుస్తానని హామీనిచ్చాడని తెలిసిందే. వారికిచ్చిన మాట ప్రకారం జపాన్‌లో అభిమానులతో చిట్‌చాట్ చేయనున్నాడు. ఇదిలా ఉంటే యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఇప్పటికే షూటింగ్ మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ప్రభాస్, తృప్తి డిమ్రిపై వచ్చే కొన్ని సన్నివేశాలను కూడా ఇటీవలే షూట్ చేశారు. షూటింగ్ నుంచి చిన్న బ్రేక్ తీసుకున్న ప్రభాస్ జపాన్ టూర్ అయిపోగానే మళ్లీ స్పిరిట్ షూట్‌తో బిజీగా కానున్నాడు. టాలీవుడ్ డైరెక్టర్ మారుతి-ప్రభాస్ కాంబోలో రాజాసాబ్ వస్తుందని తెలిసిందే. హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్రమోషన్స్‌లో భాగంగా లాంచ్ చేసిన పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్స్‌కు మంచి స్పందన వస్తోంది.



# ఉదయ్‌పూర్‌లో రష్మిక-విజయ్‌ల డెస్టినేషన్ వెడ్డింగ్

## పెళ్లి ఎప్పుడో ఇప్పుడే చెప్పలేనన్న క్యూట్ రష్మిక

టాలీవుడ్ క్యూట్ కపుల్ విజయ్ దేవరకొండ -రష్మిక మందన్న వివాహంపై గత కొన్ని రోజులుగ వాడి వేడి చర్చ నడుస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రాజస్థాన్‌లోని ఉదయపూర్ ప్యాలెస్‌లో వీరి పెళ్లి జరగనుందని ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవలే రష్మిక అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించిందన్న సమాచారం బయటకు రావడంతో ఈ రూమర్స్ మరింత వేగం పుంజుకున్నాయి. అయితే ఇప్పటి వరకు ఈ వార్తలపై ఇద్దరు నటుల తరఫున ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ నేపథ్యంలో ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో రష్మిక తన వివాహ వార్తలపై మొదటిసారి స్పందించింది. రూమర్స్‌ను ఖండించలేనని, ప్రస్తుతం మాత్రం ఏ విషయాన్నీ ధ్రువీకరించలేనని చెప్పింది. తన పెళ్లి గురించి ఎప్పుడు మాట్లాడాలో, వివరాలు ఎప్పుడు షేర్ చేసుకోవాలో అనే విషయం తనకే తెలుసని, సరైన సమయానికి అందరితో పంచుకుంటానని రష్మిక స్పష్టం చేసింది. ఇప్పుడే ఏ వివరాలూ చెప్పలేనని రష్మిక చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విజయ్?రష్మికలు ఇప్పటి వరకు ఎంగేజ్మెంట్ ఫోటో కాని, అధికారిక అనౌన్స్‌మెంట్ చేయకపోవడంతో, ఇద్దరూ ప్రత్యేకంగా ఏదో ప్లాన్ చేస్తున్నారన్న చర్చ నడుస్తోంది. ఎప్పుడు అధికారిక సమాచారం వస్తుందోనని నెటిజన్స్ ఆసక్తిగా చూస్తున్నారు. గీత గోవిందంతో హిట్ కాంబినేషన్‌గా నిలిచిన విజయ్-రష్మిక, ఆ తర్వాత డియర్ కామ్రేడ్‌లో కూడా అదే కెమిస్ట్రీని కొనసాగించారు. ప్రస్తుతం రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మరో సినిమాకు జోడీగా నటించనున్నట్టు వార్తలు వస్తున్నాయి., రీల్ లైఫ్ కపుల్‌గా ప్రారంభమైన వారి బంధం ఇప్పుడు రియల్ లైఫ్ వరకూ వెళ్తోందన్న ఊహాగానాలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. మరి దీనిపై ఎప్పుడు క్లారిటీ ఇస్తారనేది చూడాలి. ఇక రష్మిక కెరియర్ ఇప్పుడు ఫుల్ స్వింగ్‌లో ఉంది. తెలుగు, తమిళం, హిందీ భాషలలో సినిమాలు చేస్తూ సూపర్ హిట్స్ అందుకుంటుంది. నేషనల్ క్రష్ కాస్త ఇప్పుడు వరల్డ్ క్రష్‌గా మారుతుంది అంటూ ఆమె అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

# చిత్రపరిశ్రమలో ఒడుదొడుకులు సహజం

## నటి రకుల్ ప్రీత్ సింగ్ వ్యాఖ్య



చిత్రపరిశ్రమలో ఒడుదొడుకులు సహజమని నటి రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు. సినిమా అన్నాక విజయాలు, అపజయాలు..నష్టాలు, లాభాలు కూడా సహజమని అన్నారు. తన భర్త జాకీ భగ్నానీ దివాలా తీశారంటూ ఇటీవల వచ్చిన వార్తలపై ఆమె స్పందించారు. కంపెనీ మూసివేశారనే వార్తలను ఖండించారు. ఆ సమయంలో మీడియాలో వచ్చిన రూమర్స్ గురించి ప్రస్తావించారు. క్లిక్స్ కోసం ఏమైనా రాసే సంస్కృతికి అలవాటు పడ్డారు. వాస్తవానికి, ఆ వార్తలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. నాకు నిజానిజాలు అన్నీ తెలుసు కాబట్టి నేను వాటిని పట్టించుకోలేదు. పరిశ్రమలో భాగమైనప్పుడు కొన్ని విషయాల గురించి మౌనంగా ఉండడమే మంచిది. సమయం వచ్చేవరకూ ప్రజలకు అసలు నిజమేమిటనేది తెలియదు. జాకీ భగ్నానీపై వార్తలు వచ్చినప్పుడు అతడు ఎన్ని సవాళ్లు ఎదుర్కొన్నాడో నేను దగ్గర నుంచి చూశాను. కంపెనీ మూసేశారని రాశారు. అతడు నిర్మాతగా వ్యవహరించిన మూడు సినిమాలు ఆదరణ సొంతం చేసుకోలేదన్నమాట వాస్తవమే. కానీ, కంపెనీ మూసివేయలేదు. ఆర్థికంగా చాలా నష్టపోయాం. ఇండస్ట్రీలోని ప్రతి నిర్మాతకు అలా జరుగుతుంది. ఒకనొక సమయంలో అమితాబ్‌బచ్చన్‌కు కూడా ఇలానే జరిగింది. ఎదుగుతున్న సమయంలో ఇదంతా ఒక దశ అని రకుల్ అన్నారు. బాలీవుడ్ నటులు అక్షయ్‌కుమార్ (ం÷ఖబరజా ఐబీపజీస), టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బడే మియా.. ఛోటే మియా'. భారీ తారాగణంతో రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఈ సినిమా నిర్మాత, రకుల్ ప్రీత్ సింగ్ భర్త జాకీ భగ్నానీ దివాలా తీశారంటూ గతంలో వార్తలు వచ్చాయి.


# నేను సానుభూతి కోరుకోవడం లేదు

## రాజ్ నిడిమోరు మాజీ భార్య శ్యామాలి



తాను ఎవరి సానుభూతి కోసం పాకులాడటం లేదని దర్శకుడు రాజ్ నిడిమోరు మాజీ భార్య శ్యామాలి ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. తాను ఎవరికీ ఇంటర్వ్యూలు ఇవ్వనని పేర్కొన్నారు. తన నుంచి బ్రేకింగ్ న్యూస్‌లు, ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూలు ఆశించవద్దని అన్నారు. సమంత - రాజ్ నిడిమోరు వివాహం చేసుకున్న తర్వాత అందరూ తనపై జాలి చూపిస్తున్నారని.. కానీ, తాను ఏ విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. నాపై ప్రేమాభిమానాలు చూపుతున్న అందరికీ కృతజ్ఞతలు. మీ అందరి ఆశీర్వాదాలు నాకు అందుతున్నాయి. కానీ, నేను ప్రస్తుతం ఎలాంటి విషయాల గురించి పట్టించుకునే పరిస్థితుల్లో లేను. ఎందుకంటే మా గురువు క్యాన్సర్ బారిన పడినట్లు ఇటీవల తెలిసింది. నేను ఆయన కోసం ప్రార్థిస్తున్నాను. నాకు ఎలాంటి పీఆర్ టీమ్ లేదు. నా సోషల్ మీడియా ఖాతాలను నేనే నిర్వహిస్తాను. నేను మా గురువు గురించి ఆలోచిస్తూ నిద్ర లేని రాత్రులు గడుపుతున్నా. ఆ కారణంగా మీ అందరికీ స్పందించలేను. నా బాధను అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. నా నుంచి ఎలాంటి బ్రేకింగ్ న్యూస్‌లు ఆశించకండి. మీడియా వారు నాపై సానుభూతి చూపాల్సిన అవసరం లేదు. అందరూ సంతోషంగా ఉండాలని నేనెప్పుడూ కోరుకుంటాను‘ అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# ఇళయారాజాతో 50 లక్షలతో మైత్రీ



మైత్రీ మూవీ మేకర్స్ సినిమాలలో ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా పాటల వినియోగానికి సంబంధించి కొన్నిరోజులుగా వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వివాదం ఎట్టకేలకు పరిష్కారమైనట్లు తెలుస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ.. తమ సినిమాలైన 'డ్యూడ్' మరియు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాలలో ఇళయరాజా పాటలను ఉపయోగించినందుకు గాను, ఆయనకు రూ. 50 లక్షలు చెల్లించడానికి అంగీకరించినట్లు సమాచారం. ఈ చెల్లింపుతో ఆయా సినిమాల్లో ఇళయరాజా సంగీతాన్ని ఉ పయోగించడానికి మైత్రీ మూవీస్ సంస్థకు అధికారిక హక్కులు లభించినట్లు తెలుస్తుంది. కాగా దీనిపై మైత్రీ మూవీ మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**